# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 273 బుధవారం 1 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయాలు



- డబుల్ ఆర్ ట్యాక్స్ వల్ల దేశం సిగ్గుపడుతోంది
- కాంగ్రెస్ కరప్షన్‌తో అవినీతి ఊబిలోకి నెట్టేసి దేశాన్ని మొత్తం ముంచేసింది
- కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి చేస్తోంది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే గూటి పక్షులన్న ప్రధాని మోదీ
- లిక్కర్ స్కాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ తోడుదొంగలని తేలింది
- తెలంగాణలో కాంగ్రెస్ డబుల్ ఆర్ ట్యాక్స్ తెచ్చింది...
- ఢిల్లీలో గెలిస్తే 55 శాతం మీ సంపదను లాక్కుంటుంది:
- డబుల్ ఆర్‌కు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపు
- అయోధ్య రామాలయాన్ని నిర్మించింది మోదీ కాదు... మీ ఓటు అంటూ ప్రధాని వ్యాఖ్య
- ప్రధాని మాట్లాడుతుండగా 'మోదీ మోదీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు

**ఫేక్ వీడియోల వెనుక 'డబుల్ ఆర్'.. వారిని వదిలిపెట్టేది లేదు**

**మెదక్**

కాంగ్రెస్ ఏనాడూ దేశం కోసం పనిచేయదని.. ఓటు బ్యాంకు కోసమే ప్రయత్నిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం మెదక్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ తెలుగులో మోదీ స్పీచ్ ప్రారంభించారు. బసమేశ్వర్, సంగమేశ్వర్, సేవాలాల్ మహరాజ్‌కు నా నమస్కారాలు తెలిపారు. గత పదేండ్లలో ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని ఎంత అభివృద్ధి చేసిందో మీరంతా చూశారని చెప్పారు. ఒకప్పుడు ప్రపంచం మొత్తం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ కరప్షన్‌తో అవినీతి ఊబిలోకి నెట్టేసి దేశాన్ని మొత్తం ముంచేసిందన్నారు. కానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి ఊబి నుంచి -మిగతా3లో

# రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోంది



- మోదీ ఏపీకి మట్టి, తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారు
- హామీల గురించి అడిగితే తనపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారు
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపణ
- రిజర్వేషన్ల రద్దు కోసమే బీజేపీ 400 సీట్లలో గెలిపించాలని అడుగుతోందని వ్యాఖ్య

**జయశంకర్ భూపాలపల్లి:**

రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. సీతారాముల కళ్యాణం చేసిన తర్వాత అక్షింతలు ఇస్తామని.. కానీ కళ్యాణం జరగకముందే బీజేపీ నేతలు ఇక్కడ అక్షింతలు పంచారని చెప్పారు. రాముడిని బీజేపీ అవమానించిందని మండిపడ్డారు. తామంతా రాముని భక్తులమేనని స్పష్టం చేశారు. తమకంటే గొప్ప హిందువులు ఉన్నారా అని ప్రశ్నించారు. హిందువులను తాము ఓటు బ్యాంకులాగా వాడుకోమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేగొండ జనజాతర భారీ బహిరంగ సభలో బీఆర్ఎస్, బీజేపీలపై రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు. గుండు, అరగుండును గెలిపిస్తే ఏం చేశారు.. ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కరీంనగర్ అండగా నిలబడ్డిందని తెలిపారు. కరీంనగర్ ప్రజలను కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. సెమీ -మిగతా3లో



# రైతుబంధు ఇంకా రావాలి

- మంత్రి తుమ్మల వ్యాఖ్యల వీడియోను ట్వీట్ చేసిన కేసీఆర్... వీడియో ఇదిగో
- ఉద్యోగులకు వేతనాలు ఇచ్చాక తన మిగిలిన రైతుబంధు ఇస్తానని చెప్పారన్న తుమ్మల వీడియో
- తన రైతుబంధు గురించి మాట్లాడిన తుమ్మల
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకుండా ఎలా ద్రోహం చేసిందో మంత్రి ప్రకటనతో తెలిసిపోతుందని వ్యాఖ్య

# బాలికలే పైచేయి



- ఫలితాల్లో బాలికలదే హవా..
- తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల
- ఫలితాల్లో మొత్తం 91.31 శాతం ఉత్తీర్ణత
- బాలికలు 93.23 శాతం, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణులు
- 6 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత నమోదైంది
- సున్నా ఫలితాలు వచ్చిన పాఠశాలలన్నీ ప్రైవేటు స్కూల్స్ కావడం గమనార్హం

**హైదరాబాద్**

తెలంగాణ పదోతరగతి పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 30న విడుదలయ్యాయి. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. ఈసారి ఫలితాల్లో మొత్తం 91.31 శాతం -మిగతా3లో



# రాజ్యాంగం దేశంలోని పేద ప్రజల ఆత్మ

- కాషాయ పార్టీ కుయుక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం
- రాజ్యాంగాన్ని ఏ ఒక్కరూ తాకలేరు
- ఈ ప్రపంచంలో ఏ శక్తీ దాన్ని మార్చలేదు
- కానీ బీజేపీ నేతలు మాత్రం కలలు కంటున్నారు
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు

# కేసీఆర్ నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారు

- కేసీఆర్.. స్థాయిని మరిచి అబద్దాలు మాట్లాడుతున్నారన్న భట్టి
- డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయని ఆయన ఈరోజు మాట్లాడుతున్నారు.
- కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీల్లో పథకాలు అమలు చేశాం



**ఖమ్మం**

పదేళ్లు పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కూసుమంచిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భట్టి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయని ఆయన ఈరోజు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రెండు వందల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, రూ.500 కే గ్యాస్ పథకాలు అమలు -మిగతా3లో

# కాంగ్రెస్ మునిగిపోతున్న నౌక, ఏ శక్తీ కాపాడలేదు..

ఖాండ్వా: కాంగ్రెస్‌ను 'మునిగిపోతున్న నౌక'తో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోల్చారు. నౌకకు అడుగున చిల్లు పడిందని, అది మునిగిపోకుండా ప్రపంచంలోని ఏ శక్తీ కాపాడలేదని జోస్యం చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా, బద్వానీ జిల్లాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**మహాత్మా గాంధీ ఆరోజే చెప్పారు..**

గాంధీ కుటుంబంపై రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు గుప్పిస్తూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడినందున కాంగ్రెస్‌ను రద్దు చేయాలని మహాత్మాగాంధీ చెప్పారని, అయితే ఆయన అభ్యర్థనను కాంగ్రెస్ పెడచెవిన పెట్టిందని అన్నారు. మహాత్మాగాంధీ ఏదైతే చెప్పారో దానిని పరిపూర్ణం చేసేందుకు దేశ ప్రజలు ఇప్పుడు స్థిరనిశ్చయంతో ఉన్నారని, కచ్చితంగా దేశంలో కాంగ్రెస్ అనేది లేకుండా చేస్తారని అన్నారు.

**పేదరిక నిర్మూలనలో మోదీదే పైచేయి..**

జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ వంటి నేతలంతా పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పిన వాళ్లేనని, అయితే ఆ పని చేయడంలో వాళ్లు విఫలమయ్యారని రాజ్‌నాథ్ అన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో సమర్థవంతంగా 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని తెలిపారు



**ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందా?**

సూరత్, ఇండోర్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిదంటూ విపక్షం ఆరోపిస్తోందని, కాంగ్రెస్ అభ్యర్థులు గతంలో ఏకక్రీగవంగా 20 సార్లు గెలిచారని గుర్తుచేశారు. సూరత్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా గెలిచారని, ఇండోర్ కాంగ్రెస్ అభ్యర్థి పార్టీకి రాజీనామా చేసి బీజేపీకి మద్దతిచ్చారని తెలిపారు. బీజేపీ పట్ల ప్రజలకున్న ప్రేమ అటువంటిదని చెప్పారు. కాంగ్రెస్ మాత్రం బీజేపీతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అటోందని, గతంలో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా 20 సార్లు నెగ్గినప్పుడు ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందా? అని రాజ్‌నాథ్ ప్రశ్నించారు. కాగా, మధ్యప్రదేశ్‌లో నాలుగు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి రెండు దశలు ఏప్రిల్ 19, 26 తేదీల్లో జరిగాయి. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ స్థానాలు ఉండగా, 2019లో బీజేపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక సీటు దక్కించుకుంది.

# మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

ఏ రూపంలోనైనా మత ప్రాతిపదికన రిజర్వేషన్లను కాషాయ పార్టీ వ్యతిరేకిస్తుందని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పష్టం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్‌లో కోత విధించి మతపరమైన రిజర్వేషన్ కేటాయించాలనే కాంగ్రెస్, ఎస్పీ, ఇండియా కూటమి అజెండాను దేశ ప్రజలు ఆమోదించబోరని అన్నారు. గోరక్‌నాథ్ ఆలయ ప్రాంగణంలో యోగి ఆదిత్యానాథ్ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు బీజేపీ పూర్తిగా మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను అణిచివేస్తూ ఎమర్జన్సీ చీకటిరోజులను దేశంపై రుద్దిన విషయం మరువరాదని యోగి ఆదిత్యానాథ్ గుర్తుచేశారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ చేసిన పాపాలను ప్రజలు ఇంకా మరువలేదని చెప్పారు. ఆ సమయంలో యూపీఏ ప్రభుత్వంలో ఎస్పీ, బీఎస్పీలు భాగస్వామ్య పక్షాలుగా కాంగ్రెస్ పాపాల్లో పాలుపంచుకున్నాయని గుర్తుచేశారు. ఓబీసీల కోటా 27 శాతంలో కోత విధించిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అందులో 6 శాతం బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగా ఓ వర్గానికి కట్టబెట్టిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్‌లో సచార్ కమిటీ సాకుతో కొన్ని ముస్లిం కులాలకు సదరు కోటాలో వాటా కల్పిస్తూ వారిని ఆ కేటగిరీలో చేర్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా మతప్రాతిపదికన రిజర్వేషన్లతో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కాంగ్రెస్ కోత విధించిందని అన్నారు.



# ఎంపీ గారి రాసలీలలు.. స్పందించిన టాలీవుడ్ హీరోయిన్

హైదరాబాద్, ఏప్రిల్ 30: జేడీ(ఎస్) యువనేత, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వీడియోలు కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్నాయి. దీంతో అతడిపై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేయడమే కాకుండా.. అతడికి షోకాజ్ నోటీసులు సైతం జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజ్వల్ వీడియోలు ప్రత్యర్థి రాజకీయ పార్టీల చేతుల్లో రాజకీయ ఆస్త్రంగా మారాయి. ఇక ఈ లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీతో కలిసి జేడీఎస్ పోటీ చేస్తుంది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు.. బీజేపీని లక్ష్యంగా చేసుకొని విమర్శల దాడికి దిగారు. దీంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం.. ఈ వీడియోలపై తనదైన శైలిలో స్పందించారు. అయితే టాలీవుడ్ హీరోయిన్ పూనమ్ కౌర్ సైతం ప్రజ్వల్ వీడియోలపై తన అభిప్రాయాన్ని వీడియో ద్వారా తెలియజేశారు. ఒక మంత్రి కుమారుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి బ్లాక్ మెయిల్ చేస్తే.. మరో మంత్రి కుమారుడు



లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మండిపడ్డారు. మంత్రి కుమారుడు 2,800 మంది మహిళలను బలవంతంగా లైంగిక వేధింపులకు గురి చేయడమే కాకుండా.. వీడియోలు సైతం తీశారన్నారు. డబ్బు, అధికారం.. రెండు ఉన్న వాళ్లను ఈ ప్రభుత్వం ఏం చేయలేదన్నారు. జర్మనీలో ప్రజ్వల్ హాయిగా ఉన్నాడని తెలిపారు. అయితే అతడికి శిక్ష పడుతుందా? లేదా? అనేది కూడా చెప్పలేమని పూనమ్ కౌర్ అభిప్రాయపడ్డారు. మీ అందరికీ చేతులు జోడించి ఓ మహిళగా ప్రార్థిస్తున్నాను.. మీ కుమార్తెలపై, సోదరిమణులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా... వారితో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అయితే మహిళలను వేధించే వారికి, మహిళలకు గౌరవించని వారికి ఓటు వేయవద్దని సూచించారు. ఎన్నికల్లో ఓటు ఎవరికీ వేయాలనేది ఆలోచించి వేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు రక్షణ కల్పించే వారికే ఓటు వేయండని చెప్పారు. అన్యాయం చేసే వారికి అధికారం ఇవ్వద్దన్నారు. మహిళలను పూజించే దేశంలో ఇలాంటి వారిని గెలిపిద్దామా? అని పూనమ్ కౌర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. మహిళలను బలవంతం చేసిన ప్రజ్వల్ రేవణ్ణను వదిలిపెట్ట వద్దన్నారు. ఈ దేశం రావణ రాజ్యం వైపు వెళుతుందా? లేక రామ రాజ్యం వైపు వెళ్తుందా? అని ప్రశ్నించారు.

# శరద్ పవార్ లక్ష్యంగా మరోసారి ప్రధాని మోదీ విమర్శలు

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) అధ్యక్షుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్‌పై ప్రధాని నరేంద్రమోదీ మరోసారి విమర్శలు గుప్పించారు. సోమవారం ఓ ప్రచారసభలో మాట్లాడిన ప్రధాని.. శరద్ పవార్‌ను 'సంచరిస్తున్న ఆత్మ' వ్యాఖ్యానించారు. మంగళవారం సోలాపూర్‌లో జరిగిన మరో ప్రచారసభలో కూడా శరద్ పవార్ లక్ష్యంగా ప్రధాని విమర్శలు చేశారు. మహారాష్ట్రకు చెందిన ఓ బడా నాయకుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుల కోసం పెద్దగా చేసిందేమీ లేదని ఇవాళ సోలాపూర్‌లోని మల్షిరాస్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో చెరుకు రైతులు తమకు రావాల్సిన డబ్బు కోసం షుగర్‌కేన్ కమిషన్ చుట్టు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చిందని అన్నారు. శరద్‌పవార్ పేరును ప్రస్తావించకుండానే ఆయనపై విమర్శలు చేశారు. నిన్న (సోమవారం) కూడా శరద్ పవార్‌ను ప్రధాని మోదీ సంచరిస్తున్న ఆత్మతో పోల్చారు. మహారాష్ట్రలో ఒక



సంచరిస్తున్న ఆత్మ ఉన్నది. ఆ ఆత్మ అనుకున్నది జరగనప్పుడు ఇతరులు చేసే మంచి పనులను చెడగొడుతుంది. ఆ ఆత్మకు మహారాష్ట్ర బాధితురాలు. ఆ నాయకుడు ఈ ఆటను 45 ఏళ్ల క్రితమే మొదలుపెట్టాడు. 'మహారాష్ట్రలో ఎప్పుడూ స్థిరత్వం ఉండకూడదు' అనే ఆయన ఆకాంక్ష మేరకే ఈ ఆట. అందుకే మహారాష్ట్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పూర్తిగా ఐదేళు పదవిలో కొనసాగలేకపోయారు' అని ప్రధాని ఆరోపించారు. ఇవాళ్టి సోలాపూర్ ర్యాలీలో కూడా శరద్‌పవార్‌నే ప్రధానంగా మోదీ టార్గెట్ చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు వేసి అమూల్యమైన ఓటును వృథా చేసుకోవద్దని ఓటర్లకు సూచించారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటేనే పనులు బాగా జరుగుతాయని అన్నారు. ప్రజలు తమ పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించారని వ్యాఖ్యానించారు. తాము 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు.

## ఆయనకు మేజర్ శస్త్రచికిత్స జరిగింది.. రాఘవ్ చద్దా అదృశ్యంపై ఢిల్లీ మంత్రి క్లారిటీ


ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా గత కొంతకాలంగా భారత్‌లో కనిపించడం లేదు. ముఖ్యంగా ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత కూడా ఆయన ప్రత్యక్షం కాలేదు. దీంతో యంగ్ లీడర్ అదృశ్యంపై మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపించాయి. కేసుల భయంతో ఆయన విదేశాలకు పారిపోయారంటూ పుకార్లు వ్యాపించాయి. అయితే, ఆ పుకార్లకు ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తాజాగా పులుస్టాప్ పెట్టారు. కంటి శస్త్రచికిత్స కోసం రాఘవ్ చద్దా యూకే వెళ్లినట్లు వెల్లడించారు. ఈ మేరకు



మంగళవారం మీడియాతో సౌరభ్ భరద్వాజ్ మాట్లాడారు. 'రాఘవ్ గత కొంతకాలంగా కంటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. చికిత్స కోసం యూకే వెళ్లారు. అక్కడ ఆయనకు మేజర్ కంటి శస్త్ర చికిత్స జరిగింది. ఇది చాలా తీవ్రమైనది. సకాలంలో చికిత్స అందించకపోతే అంధత్వం వచ్చే ప్రమాదం ఉంది. అతను త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. కోలుకున్న వెంటనే తిరిగి భారత్ వచ్చి పార్టీ ప్రచారంలో పాల్గొంటారు' అని భరద్వాజ్ తెలిపారు.

## సిసోడియాకు మళ్లీ నిరాశ.. రెగ్యులర్ బెయిలుకు కోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ:** ఎక్సైజ్ పాలసీకేసులో 'ఆప్' నేత మనీష్ సిసోడియాకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆయన రెండోసారి దాఖలు చేసుకున్న బెయిల్ దరఖాస్తును రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారంనాడు తోసిపుచ్చింది. ఆయనకు బెయిల్ ఇచ్చే



విషయంపై సీబీఐ, ఈడీలు రెండూ అభ్యంతరం వ్యక్తం చేశాయి. స్కామ్‌లో సిసోడియా కీలక సూత్రధారి అని, ఆయనకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షాలను తారుమారు చేయడం, సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని దర్యాప్తు సంస్థలు వాదన వినిపించాయి. గతంలోనూ సిసిడోయాకు బెయిల్ ఇచ్చేందుకు దిగువ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు నిరాకరించాయి.

**హైకోర్టుకు వెళ్లనున్న సిసోడియా**

కాగా, రెగ్యులర్ బెయిల్‌కు రౌస్ అవెన్యూ నిరాకరించినందున హైకోర్టుకు సిసోడియా వెళ్లనున్నట్టు 'ఆప్' వర్గాలు తెలిపాయి. ఈ కేసులో సిసోడియాను గత ఏడాది ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసింది.

## రాజ్యాంగం దేశంలోని పేద ప్రజల ఆత్మ

రాజ్యాంగ మార్పులు, రిజర్వేషన్ల వ్యవహారంలో కాషాయ పార్టీ లక్ష్యంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భింద్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. తాము ఎన్నికల్లో విజయం సాధిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, దాన్ని రద్దు చేస్తామని అమిత్ షా సహా బీజేపీ అగ్రనేతలు స్పష్టంగా చెప్పారని వెల్లడించారు. రాజ్యాంగం దేశంలోని పేద ప్రజల ఆత్మని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఏ ఒక్కరూ తాకలేరని, ఈ ప్రపంచంలో ఏ శక్తీ దాన్ని మార్చలేదని కానీ బీజేపీ నేతలు మాత్రం కలలు కంటున్నారని వ్యాఖ్యానించారు. బాబా సాహెబ్‌తో పాటు బ్రిటిషర్లతో పోరాడిన వ్యక్తులు ప్రజల గొంతుకగా రాజ్యాంగాన్ని తయారు చేశారని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని చెరిపేయడాన్ని రైతులు, కార్మికులు సహించరని దాన్ని తాము కాపాడితీరుతామని స్పష్టం చేశారు. కాగా మోదీ ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపడితే బీజేపీ దేశ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ సహా విపక్షాలు కాషాయ పార్టీపై ఆరోపణలు చేస్తున్నాయి. అయితే రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్రనేతలు పదేపదే చెబుతున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని రిజర్వేషన్లను రద్దు చేయాలని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కోరుకున్నా అది సాధ్యం కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కాంగ్రెస్, విపక్ష ఇండియా కూటమి కుట్రలను ఛేదించేందుకే ఎన్డీయే కూటమికి 400కుపైగా సీట్లు కట్టబెట్టాలని ప్రజలను కోరుతున్నామని ప్రధాని చెబుతున్నారు.

## 'ప్రేమ దుకాణం'లో నకిలీ వీడియోల అమ్మకం.. కాంగ్రెస్‌పై మోదీ వ్యంగ్యాస్త్రాలు

ముంబై: 'డీప్ ఫేక్' వీడియోలపై విపక్షాలను టార్గెట్ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ వీడియోలను విపక్షాలు సర్క్యులేట్ చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా లేకనే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని విపక్షాలు వ్యాప్తి చేస్తున్నాయని అన్నారు. మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వీడియోలను సృష్టించడంపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశ్తూ, విపక్షాలు ప్రధానంగా తనను టార్గెట్ చేస్తున్నాయని అన్నారు. "ఇప్పుడు వారి అబద్ధాలు ఎవరూ నమ్మడం లేదు. దానితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నా ఫేస్ ఉపయోగించుకుని తమ ప్రేమ దుకాణాల్లో అమ్మకానికి పెడుతున్నారు" అని మోదీ విమర్శించారు.

**జాతి ఆత్మగౌరవ ఎన్నికలు**

ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు జాతి ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటమని ప్రధానమంత్రి అభివర్ణించారు. బలహీన ప్రభుత్వం ఏర్పడితే అది ఎప్పుడైనా కూలిపోతుందని అన్నారు. ఆరు దశాబ్దాలు అధికారంలో ఉన్నప్పటికీ దేశం ఎదుర్కొంటున్న నీటి సరఫరా సవాళ్లను కాంగ్రెస్ సమర్థవంతంగా పరిష్కరించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం నీటి సరఫరా మౌలిక వసతుల మెరుగుకు సమర్థవంతమైన చర్యలు తీసుకుందని వివరించారు.

## ఢిల్లీ కాంగ్రెస్ తాత్కాలిక చీఫ్‌గా దేవేంద్ర యాదవ్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ విభాగం తాత్కాలిక అధ్యక్షుడుగా దేవేంద్ర యాదవ్ ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆయన నియామకం తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. పంజాబ్ ఏఐసీసీ ఇన్‌చార్జి కూడా ఆయన కొనసాగుతారని పేర్కొంది. డీపీసీసీఐ చీఫ్ పదవికి అరవిందర్ సింగ్ లవ్లీ రాజీనామా చేయడంతో తాజా నియామకం జరిగింది. కీలకమైన ఢిల్లీ యూనిట్ చీఫ్ పదవికి దేవేందర్ యాదవ్ పేరుతో పాటు రాజేష్ లిలోతియా, అభిషేక్ దత్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చినట్టు డీపీసీసీ వర్గాలు సోమవారం ఉదయం తెలిపాయి. కాగా, డీపీసీసీ చీఫ్ పదవికి అరవీందర్ సింగ్ లవ్లీ శనివారంనాడు రాజీనామా చేయడం పార్టీలో ఒకింత కలకలం రేపింది. ఢిల్లీ యూనిట్ వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో 'ఆప్'తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం తనకు అసంతృప్తి కలిగించినట్టు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు పంపిన రాజీనామా లేఖలో లవ్లీ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, తాను పార్టీలోనే కొనసాగుతానని లవ్లీ ప్రకటించారు.



## ఎన్నికల ముందు కేజ్రీవాల్ అరెస్ట్ ఎందుకు

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ ఎన్నికలకు కేవలం కొద్దిరోజుల ముందే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్ట్ చేశారనే ప్రశ్నలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పందించాలని సర్వోన్నత న్యాయస్థానం దర్యాప్తు ఏజెన్సీని కోరింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడాన్ని సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ సుప్రీంకోర్ట్ బెంచ్ దర్యాప్తు ఏజెన్సీని ప్రశ్నించింది. వ్యక్తి స్వేచ్ఛ అనేది చాలా కీలకమైనదని దీన్ని మీరు నిరాకరించలేరని జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. ఇక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సమయంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. విచారణ చేపట్టడం, ఆపై పలు ఫిర్యాదుల పునరావృతం కావడం మధ్య ఎందుకు విరామం ఉందనే వివరాలపైనా స్పందించాలని దర్యాప్తు సంస్థను సుప్రీంకోర్టు కోరింది. లిక్కర్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడం అక్రమమని కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం(ఏప్రిల్30) విచారించింది. అంతకుముందు కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. లిక్కర్ కేసులో కేజ్రీవాల్ కమ్యూనికేషన్స్ ఇంఛార్జ్ విజయ్‌నాయర్‌ను ఈడీ 2022లో అరెస్టు చేసిందని, కేజ్రీవాల్‌ను మాత్రం 2024 దాకా ఆగి ఇప్పుడు అరెస్టు చేసిందన్నారు. ఇంత సమయం ఎందుకు తీసుకున్నారనేదానిపై క్లారిటీ లేదన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్టేట్‌మెంట్ ఆధారంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని చెప్పారు. అయితే ఆ స్టేట్‌మెంట్ ఇచ్చిన వెంటనే శ్రీనివాసులు రెడ్డి కొడుకు రాఘవకు ఈ కేసులో బెయిల్ వచ్చిందన్న విషయాన్ని సింఘ్వి కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసులో శ్రీనివాసులు రెడ్డి మొదట్లో కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఎలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వలేదని, తర్వాతే మాట మార్చారని వాదించారు.



# కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయాలు

-మొదటి పేజి తరువాయి

దేశాన్ని అతి కష్టంగా బయటకు తీసుకొచ్చిందని వివరించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి చేస్తోందని మోదీ విరుచుకుపడ్డారు.

అబద్ధపు వాగ్ధానాలు, ఓటుబ్యాంకు రాజకీయం, మాఫియా, అపరాధులను పెంచి పోషించడం, కుటుంబ పాలన, కరప్షన్‌ను నమ్ముకుందని చెప్పారు. ఈ ఐదు సూత్రాలే చేతిగుర్తు వని.. వీటితోనే కాంగ్రెస్ పాలించిందని ఆరోపించారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీ దేశానికి ట్రిపుల్ ఆర్ లాంటి సూపర్ హిట్ చిత్రాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. ట్రిపుల్ ఆర్ మూవీతో టాలీవుడ్ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిందని తెలిపారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు.

డబుల్ ఆర్ ట్యాక్స్ పై తెలంగాణ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. డబుల్ ఆర్ ట్యాక్స్ వల్ల దేశం సిగ్గుపడుతోందన్నారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తుల నుంచి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.అందులో వాటా నల్లధనం రూపకంగా ఢిల్లీకి పోతోందని విమర్శించారు. మీకు ఆ డబుల్ ఆర్ ఎవరో అందరికీ తెలుసునని అన్నారు. ట్యాక్స్ వసూళ్లతో ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేస్తారని మండిపడ్డారు.

ఎంతగా అంటే తెలంగాణ ప్రజలు తిరిగి కోలుకోనంతగా దోచేస్తారని ఆరోపించారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ మొత్తం దోచుకుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్క గూటి పక్షులే.. అవి వేర్వేరు కావని చెప్పారు. కాంగ్రెస్ దోచుకునేందుకు కొత్త విధానాన్ని తీసుకొస్తోందన్నారు.ఇన్ హెరిటెన్స్(వారసత్వ సంపద) ట్యాక్స్ తీసుకురావాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఇది అమలుచేస్తే మీరు జీవితాంతం కష్టపడి దాచుకున్న సొమ్మును మీ మరణం తర్వాత మీ వారసులకు ఇవ్వలేరని చెప్పారు. అలాంటి విధానాన్ని కాంగ్రెస్ తీసుకురానుందన్నారు.

55 శాతం వసూలు చేయాలని చూస్తోందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొన్నటి వరకు తెలంగాణను బీఆర్ఎస్ దోచుకుందని... ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని విమర్శించారు.కాంగ్రెస్ విపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఎన్నో విమర్శలు చేసిందని అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఈ కేసుకు సంబంధించిన ఫైళ్లను ఎందుకు తొక్కి పెట్టిందని ప్రశ్నించారు.

ఈ రెండు పార్టీలు ఒకరినొకరు కాపాడుకోవాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు వేర్వేరు కాదు.. ఒక్కటేనని చెప్పారు..కరప్షన్ రాకెట్ కమిటీకి చెందిన పార్టీలని ఎద్దేవా చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ద్వారా ఇది అర్థమవుతోందన్నారు. బీఆర్ఎస్.. ఆప్‌తో కలిసి లిక్కర్ స్కామ్ చేసిందని విమర్శించారు. ఢిల్లీలో లిక్కర్ స్కామ్ చేసిన పార్టీతో కాంగ్రెస్ అలయెన్స్ పెట్టుకుందన్నారు.కరప్షన్ చేసిన అందరూ ఒకరినొకరు సమర్థించుకుంటున్నారని



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

"కాంగ్రెస్.. రైతులకు వెన్నుపోటు పొడవడానికి కూడా వెనుకాడటంలేదు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు.ఇప్పుడు ఇవ్వకుండా, కనీసం దానిపై మాట్లాడకుండా నోటికి తాళం వేసుకున్నారు. కాంగ్రెస్ పేదలను.. మరింత పేదలుగా మార్చాలని చూస్తోంది. ఇక్కడి ప్రజల ఉత్సాహం చూస్తుంటే డబుల్ ఆర్‌లో ఒకరికి నిద్రలేకుండా పోతుంది. కాంగ్రెస్.. పేదలు, వెనుకబడిన వారు, దళితులు, ఆదివాసీలు, మహిళలను ఎన్నటికీ ఎదగనివ్వదు.కాంగ్రెస్ హయాంలో మహిళలకు అధికారం దక్కలేదు, కనీసం మహిళలకు రక్షణ కూడా కల్పించలేదు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. అయోధ్య రామమందిరం 500 ఏండ్ల కల. అయోధ్య రామమందిరాన్ని నిర్మించామా? లేదా?. ఇది మోదీ కట్టించలేదు.. మీ ఒక్క ఓటు కట్టించేలా చేసింది" అని మోదీ తెలిపారు.

"కనీసం హైదరాబాద్‌లో పండుగ నిర్వహించుకోవాలంటే కూడా చివరకు శ్రీరామ నవమికి కూడా ఆంక్షలు పెట్టింది. ఒక వర్గం ఓట్ల కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2009లో కాంగ్రెస్‌కు రికార్డు స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించారు.కానీ కాంగ్రెస్ ఏం చేసింది. గెలిచాక ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కాలరాసింది. ఏపీని ఒక ప్రయోగశాలగా మార్చి ఓబీసీల రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టింది.ముస్లింల మెప్పు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. లింగాయత్, మరాఠీలు, 26 ఇతర బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని అడుగుతున్నారు. కానీ కాంగ్రెస్ అంగీకరించలేదు.. అదే ముస్లింలను మాత్రం రాత్రికి రాత్రే బీసీ జాబితాలోకి చేర్చింది.బంజారాలు సమాజంలో ఎంతో గౌరవ జీవితాన్ని గడిపేవారు.. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేరస్తులుగా చూశాయి, వారిని వంచించాయి. రాజ్యాంగం, రిజర్వేషన్లపై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోంది. కానీ ఎస్సీ వర్గీకరణకు నేను కట్టుబడి ఉన్నాను.. మీకోసం నేను పోరాడుతా. కాంగ్రెస్ మొదటి నుంచి రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను గౌరవించలేదు" అని మోదీ అన్నారు.

"రాజ్యాంగంలో ప్రతి పేజీలో రామాయణం, మహాభారతం, జీవిత సంస్కృతికి సంబంధించిన లింకును తుడిచిపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ చేసింది. ఈ దేశ మొదటి ప్రధాని రాజ్యాంగాన్ని అవహేళన చేసి పెద్ద తప్పు చేశాడు.. ఆయన తర్వాత ఇప్పుడున్న యువరాజు నానమ్మ రాజ్యాంగాన్ని తన రాజకీయ అవసరాల కోసం రాజ్యాంగానికి తూట్లు పొడిచింది. ఎమర్జెన్సీ విధించింది. రాహుల్ తండ్రి ప్రధానిగా ఉన్నప్పుడు మీడియా, పత్రిక స్వేచ్ఛను హరించారు. ఎన్నో పాపాలు చేసిన కాంగ్రెస్.. రాజ్యాంగం గురించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోంది. మన్మోహన్ సింగ్ కేబినెట్ ఒక నిర్ణయం తీసుకున్నారు.. చట్టరూపకంగా బిల్లును తీసుకువస్తే.. దాన్ని రాహుల్ చింపివేశారు. మతపర రిజర్వేషన్లు వద్దని రాజ్యాంగంలో ఉంటే.. రాహుల్ గాంధీ ఓటుబ్యాంకు రాజకీయాల కోసం మతపరమైన రిజర్వేషన్లను ప్రోత్సహిస్తోంది. కాంగ్రెస్ నేతలారా.. చెవులు తెరిచి వినండి. రాజ్యాంగం రచించి 60 ఏళ్ల సందర్భంగా ఏనుగుపై రాజ్యాంగాన్ని ఊరేగించాను. రాజ్యాంగంపై మాకు ఉన్న నమ్మకాన్ని మీరు శంకించాల్సిన అవసరం లేదు.. దీనికోసం నేను నా జీవితాన్ని త్యాగం చేశాను" అని మోదీ తెలిపారు.

"2019లో రెండోసారి ప్రధాని అయ్యాక నా బాధ్యతలు స్వీకరించే సమయంలో రాజ్యాంగాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాల్లో పెట్టి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాను. రాజవంశీయులు అధికార దాహంతో రాజ్యాంగాన్ని అవమానించారు. చివరకు కాంగ్రెస్ పార్టీ రచించుకున్న రాజ్యాంగాన్ని కూడా అవమానించారు.. ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సీతారాం కేసరిని బాత్రూంలో బంధించి సోనియాగాంధీని అధ్యక్షురాలిగా చేసుకున్నారు.ఇది కాంగ్రెస్ చరిత్ర. అధికారం కోసం దేనికైనా కాంగ్రెస్ దిగజారుతోంది. ఈవీఎంలు, ఎన్నికల కమిషన్‌ను కూడా నమ్మడం లేదు. మోదీ బతికి ఉన్నంత వరకు రాజ్యాంగాన్ని కదిలించే వ్యక్తి, శక్తి ఎవరూ ఉండరు" అని కాంగ్రెస్ నేతలకు మోదీ సవాల్ విసిరారు.

"రాజ్యాంగాన్నికాపాడే బాధ్యత నేను తీసుకుంటున్నాను. మోదీ మూడోసారి అధికారంలో వస్తే రాజ్యాంగం రచించి 75 ఏళ్లయిన సందర్భంగా వాడవాడలా ఉత్సవం నిర్వహిస్తాం. కాంగ్రెస్ చేసిన తప్పులను, మోసాలు, అవినీతిని బయటపెడుతాం.. దోషిగా నిలబెడుతాం. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ నాయకులు అవమానిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భావించి ఫేక్ వీడియో సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారు. ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు.దీని వెనుక డబుల్ ఆర్ వ్యక్తుల పేర్లు ఉన్నాయని తెలుస్తోంది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒక ముఖ్యమంత్రి ఇలా చేయొచ్చా? ఇండి కూటమికి ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కే పరిస్థితి లేదు. ఆ పార్టీకి అతి తక్కువ సీట్లు రాబోతున్నాయి. మీరు రఘునందన్ రావు, బీబీ పాటిల్‌కు ఓటు వేస్తే మోదీకి పడినట్లే" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

# రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోంది

-మొదటి పేజి తరువాయి

ఫైనల్లో కేసీఆర్‌ను ఓడించాం..ఫైనల్లో గుజరాత్ గులాములను ఓడిస్తామని చెప్పారు. మోదీ తెలంగాణకు ఇచ్చింది ఏం లేదని.. బండి సంజయ్ రాష్ట్రానికి తెచ్చింది ఏం లేదన్నారు. తెలంగాణను మోదీ అవమానిస్తుంటే..బండి సైలెంట్‌గా ఉన్నారని ధ్వజమెత్తారు. గుండు, అరగుండును గెలిపిస్తే.. ఏం చేశారని ప్రశ్నించారు. నిజామాబాద్, కరీంనగర్ బీజేపీ ఎంపీలు నాటకాలు ఆడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

### బలహీన వర్గాలపై మోదీ సర్జికల్ స్ట్రైక్స్

"నన్ను అరెస్టు చేసిన కేసీఆర్‌ను ఓ మూలకు పండబెట్టా. కారును తూకం వేయాల్సిందే. కారు షెడ్డుకు పోయింది.. అందుకే కేసీఆర్ బస్సు యాత్ర చేస్తుండు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఒకరి మీద ఒకరు బలహీన అభ్యర్థులను పెట్టుకున్నారు. మోదీ మా ప్రశ్నకు సమాధానం చెప్పు. రిజర్వేషన్లు రద్దు చేసే హక్కు మీకు ఎవరిచ్చారు. బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయం. బీజేపీ ఓడిపోతేనే..ప్రజలు గెలుస్తారు. బలహీన వర్గాల మీద మోదీ సర్జికల్ స్ట్రైక్స్ చేస్తారు" అని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం



వ్యక్తం చేశారు. కాగా.. ఈ సభలో ఆసక్తిరక దృశ్యం చోటుచేసుకుంది. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు అని ఓ గుడ్డు ఆకారంతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అడిగినవి ఇవి అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 10 ఏళ్లలో బీజేపీ తెలంగాణకు ఇచ్చింది ఏం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సభలో గాడిద గుడ్డు ఆకారం ప్రదర్శన చర్చగా మారింది.

### అమిత్ షాను కేసీఆర్ ఆవహించినట్లున్నారు

ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కర్ణాటకకు చెంబు, ఆంధ్రప్రదేశ్‌కు మట్టి, చెంబు నీళ్లు, తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణకు ఈ గుడ్డు ఇచ్చినందుకు బీజేపీకి ఓటు వేయాలా? అని ప్రశ్నించారు. మంగళవారం ఆయన భూపాలపల్లి జనజాతర సభలో మాట్లాడుతూ... అమిత్ షాను కేసీఆర్ ఆవహించినట్లున్నారని ఎద్దేవా చేశారు.

వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టు రాకుండా ప్రధాని మోదీ అడ్డుకున్నారని ఆరోపించారు. హామీల గురించి అడిగితే తనపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్ల రద్దు కోసమే బీజేపీ 400 సీట్లలో గెలిపించాలని అడుగుతోందన్నారు. రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. సాధారణంగా సీతారాముల కల్యాణం చేసిన తర్వాత అక్షితలు ఇస్తారని, కానీ కల్యాణం జరగకముందే బీజేపీ నేతలు ఇక్కడ అక్షితలు పంచారని మండిపడ్డారు. రాముడిని బీజేపీ అవమానించిందన్నారు. తామంతా రాముని భక్తులమేనని స్పష్టం చేశారు. తమకంటే గొప్ప హిందువులు ఉన్నారా? అని ప్రశ్నించారు. హిందువులను తాము ఓటు బ్యాంకులాగా ఉపయోగించుకునేది లేదన్నారు.


# ఇక ఇంటర్‌లోనూ ఆన్‌లైన్ అడ్మిషన్లు?

**దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లుగానే జూనియర్ కళాశాలల్లో కూడా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు**

**ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టేలా ఇంటర్ బోర్డు కసరత్తు**

**విద్యార్థులకు అందించే సేవలతో పాటు ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే**

**హైదరాబాద్ :** డిగ్రీ తరహాలో ఇంటర్‌లోనూ ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టేలా ఇంటర్ బో ర్డు కసరత్తు చేస్తోంది. దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లుగానే జూనియర్ కళాశాలల్లో కూడా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు చేపడతామని అధికారులు కొన్నేళ్లుగా చెబుతున్నా, వివిధ కారణాలతో వాయిదా పడుతూనే వస్తోంది. ప్ర స్తు తం రాష్ట్ర ఇంటర్ బోర్డ్ సర్వీసులు ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అందించే సే వలతో పాటు ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గు ర్తింపు ప్రక్రియ కూడా ఆన్‌లైన్ విధానంలోనే చేపడుతున్నారు. కానీ ప్రధానమైన ప్రవేశాలు సైతం ఆన్‌లైన్‌లో చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఇటీవల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. డిగ్రీ తరహాలో ఇంటర్‌లో కూడా ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే కళాశాలలఫీజులు వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. దాంతో ఆయా కళాశాలల ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించే




అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో న్యాయపరమైన అంశాలను, ఇతర అంశాలను పూర్తిగా పరిశీలించి జూనియర్ కాలేజీల్లోనూ ఆన్‌లైన్ ప్రవేశాలు చేపట్టే విధంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.జూనియర్ కళాశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఇంటర్ కోర్సుల ఫీజుల నియంత్రణకు ఇప్పటివరకు ఎలాంటి విధానం లేకపోవడంతో యాజమాన్యాలే ఫీజులు ఖారారు చేసుకుంటున్నాయి. అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం ఇప్పటివరకు లేవు. దేశంలోనే చాలా రాష్ట్రాల కంటే తెలంగాణ, ఎపి రాష్ట్రాలలోని కార్పోరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజులు అత్యధికంగా ఉన్నాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు ఉండాలి. కానీ ప్రైవేట్ కళాశాలల ఫీజుల్లో ఆదాయానికి, వ్యయానికి ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఆదాయంలో సగం కూడా వ్యయం ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఐఐటి, జెఇఇ, నీట్, ఎంసెట్ కోచింగ్ వంటి వివిధ రకాల పేర్లతో ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు కూడా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫీజుల వసూలు ప్రక్రియ కూడా ఆన్‌లైన్ ద్వారా చేపట్టే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. దాంతో ఆయా కళాశాలల ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

## 'నా రైతుబంధు ఇంకా రావాలి'



తనకు రైతుబంధు రాలేదన్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణలో రైతుబంధు పడటం లేదని బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. అయితే విపక్షాలు అబద్దాలు చెబుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. ఈ క్రమంలో స్వయంగా మంత్రి తుమ్మల మాట్లాడిన వీడియోను బీఆర్ఎస్ అధినేత ట్వీట్ చేశారు. ఈ వీడియోలో 'నా రైతుబంధు ఇంకా కొద్దిగా రావాలి ఇవ్వమంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన తర్వాత ఇస్తానని చెప్పారు పెద్దాయన' అంటూ తన పక్కనే ఉన్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను చూపిస్తూ అన్నారు. దీనిని ట్వీట్ చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతులకు రైతుబంధు ఇవ్వకుండా ఎలా ద్రోహం చేసిందో వ్యవసాయ మంత్రి ప్రకటనతో తెలిసిపోతుందని పేర్కొన్నారు.

## బాలికలే పైచేయి

-మొదటి పేజి తరువాయి

ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 3927 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 6 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత నమోదైంది. సున్నా ఫలితాలు వచ్చిన పాఠశాలలన్నీ ప్రైవేటు స్కూల్స్ కావడం గమనార్హం. ఫలితాల్లో 99.09 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా, 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండోస్థానంలో, 98.27 శాతం ఉత్తీర్ణతతో సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఇక 65.10 ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది.

తెలంగాణలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. అయితే ఫలితాల వెల్లడి సమయంలోనే పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన తేదీలను విద్యాశాఖ వెల్లడించింది. దీనిప్రకారం జూన్ 3 నుంచి 13 వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయాతేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలతో సంబంధం లేకుండా పరీక్షల్లో ఫెయిల్ అయినా విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించి, పరీక్షలకు హాజరుకావాలని విద్యాశాఖ సూచించింది.విద్యార్థులు మే 16 వరకు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించవచ్చు. పదోతరగతి ఫలితాలపై ఏమైనా అనుమానాలుంటే రీకౌంటింగ్ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం రూ.500 ఫీజు చెల్లించాలి. ఇక రీవెరిఫికేషన్, డూప్లికేట్ క్వశ్చన్ పేపర్స్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. మే 15 లోగా నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సంతకం చేయించిన దరఖాస్తులో హాల్‌టికెట్లు జతపరిచి డీఈవో ఆఫీస్‌కు పంపించాల్సి ఉంటుంది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మాత్రమే వీటిని ఇవ్వాల్సి ఉంటుంది. కొరియర్, పోస్టు చేసిన దరఖాస్తులు స్వీకరించేది లేదని అధికారులు తేల్చి చెప్పేశారు.

### ఫలితాల్లో బాలికలదే హవా..

తెలంగాణ పదోతరగతి పరీక్షలకు మొత్తం 5,05,813 మంది విద్యార్థులు హాజరుకాగా.. 4,91,862 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో మొత్తం 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 3927 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 6 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత నమోదైంది. సున్నా ఫలితాలు వచ్చిన పాఠశాలలన్నీ ప్రైవేటు స్కూల్స్ కావడం గమనార్హం. ఫలితాల్లో 99.09 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా, 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండోస్థానంలో, 98.27 శాతం ఉత్తీర్ణతతో సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఇక 65.10 ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది.. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు దాదాపు 5 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు.

## కేసీఆర్ నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారు



-మొదటి పేజి తరువాయి

చేశామని తెలిపారు. రైతులపైన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందన్నారు. తాము వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు ఇన్సూరెన్స్ కట్టించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల మెస్ బిల్లులు కట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిందని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీకునే జీతాలు ఇస్తున్నామన్నారు. సిగ్గులేకుండా కరెంటు పోతుందని మాజీ ముఖ్యమంత్రి తన స్థాయిని మర్చిపోయి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బండకేసి బాది ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారన్నారు. రామచంద్రస్వామి సన్నిధిలో పేదలకు ఇళ్ళు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఐదు వేలు ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ దేశ సంపదను వారికి అనుకూలంగా ఉన్న వారికి దోచిపెడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపి దేశాన్ని దోపిడీ చేయాలని చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భట్టి విక్రమార్క కోరారు.

## మే 8న కరీంనగర్‌కు ప్రధాని మోదీ రాక?

**జిల్లా నేతలకు సమాచారం**

**మోదీ సభ విజయవంతంపై బీజేపీ ఫోకస్**

**సభను సక్సెస్ చేయాలని కార్యకర్తలకు బండి సంజయ్ పిలుపు**

**శక్తి కేంద్ర ఇంఛార్జీలతో సమావేశమైన సంజయ్**

**కరీంనగర్/హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే నెల 8న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించే అవకాశముంది. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుండి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం పంపింది. పార్టీ వర్గాల సమాచారం మేరకు? ఆరోజు ఉదయం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వేములవాడలో పర్యటిస్తారు. ప్రధాని రాక సమాచారాన్ని అందుకున్న జిల్లా నాయకత్వం సభాస్థలి, ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి వేములవాడ రానున్న నేపథ్యంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ఎములాడ రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 10 గంటలకు రాజన్న దర్శనాంతరం ఎములాడలో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు హాజరై మోదీ ప్రసంగించేలా షెడ్యూల్ ను ఖరారు చేయనున్నారు. ప్రధాని పర్యటన పూర్తి షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో అధికారికంగా వెల్లడయ్యే అవకాశముంది. మరోవైపు ఈరోజు ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ శక్తి కేంద్ర ఇంఛార్జీల సమావేశం జరిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ తోపాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, జిల్లా ఇంఛార్జీ మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాల

# సంపాదకీయం


## విశ్వగురువు పాలనలో శ్రామికుల దుస్థితి

వ్యవసాయ శ్రామికుల నిజ వేతనాలలో కాని, తక్కిన గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో కాని 2014-2023 మధ్య పదేళ్ళ కాలంలో ఎటువంటి వాస్తవ పెరుగుదలా నమోదు కాలేదన్న వాస్తవాన్ని అనేకమంది అధ్యయనకారులు చేసిన తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ శ్రామికుల వినిమయ సూచీని, గ్రామీణ శ్రామికుల వినిమయ సూచీని పరిగణనలోకి తీసుకుని, ఆ సూచీలలో వచ్చిన ధరల పెరుగుదలకు అనుగుణంగా గ్రామీణ శ్రామికుల వేతనాలలో పెరుగుదల వచ్చిందా అన్న విషయాన్ని వారు పరిశోధించారు. ఐతే ఇక్కడో సమస్య ఉంది. ఆ రెండు సూచీలూ 1986-87 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని రూపొందించినవి. అంటే, 1986-87 నాటికి, దాదాపు 40 ఏళ్ళ క్రితం నాటి, వినిమయం ఉండిన తీరునే ఇప్పుడు కూడా ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కలు వేసినవి. కాని, ఈ 40 సంవత్సరాల కాలంలోనూ ప్రజల వినిమయంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకపోతే ఈ తరగతుల ప్రజల మీద ధరల పెరుగుదల ప్రభావం ఎంత మోతా దులో ఉందో సరైన అంచనాకు రాలేము. అందుచేత సమీప కాలంలోని వినిమయ ధోరణుల్ని వ్యక్తం చేసే ప్రాతిపదికను ఎంచుకోవడం మంచిది. ఐతే ప్రభుత్వం 2010 ప్రాతిపదికన కొత్త సూచీని రూపొందించింది. శ్రామికుల వేతనాల మీద ధరల పెరుగుదల వాస్తవ ప్రభావం ఎంత ఉంటుందో, దానికన్నా తక్కువ చేసి చూపించడం దీని వెనుక ప్రధాన ఉద్దేశం. ఐనప్పటికీ ఆ 2010నే ప్రాతిపదికగా తీసుకుని చూస్తే అప్పుడు కూడా గ్రామీణ శ్రామికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు సరికదా స్వల్ప తగ్గుదల నమోదైంది. ఉదాహరణకి, 2014-2023 మధ్య కాలంలో పొలాలను దున్నే శ్రామికుల నిజవేతనాలు 2.7 శాతం తగ్గిపోయాయి. ఇదేమాదిరిగా తక్కిన వ్యవసాయ పనులకు చూసినా, తగ్గుదలే కనిపిస్తోం ది తప్ప పెరుగుదల లేదు. దీనిని బట్టి గత దశాబ్ద కాలంలో గ్రామీణ శ్రామికుల నిజవేతనాలు తగ్గిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రభుత్వం తీరును కొట్టొచ్చినట్టు చూపించే విషయం ఇది. గతంలో ఏ ప్రభుత్వమూ జిడిపి వృద్ధి రేటు గురించి మోడీ ప్రభుత్వం చేసినంత ప్రచారం, హడావుడి చేయలేదు. నిజానికి ఈ జిడిపి కూడా గత ప్రభుత్వాల కాలంతో పోల్చితే మోడీ హయాంలో తక్కువ వృద్ధిరేటునే నమోదు చేసింది. ఎప్పుడు చూసినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతోందంటూ మోడీ వల్లిస్తున్నారు. అతడి భజన బృందాలైతే ఇప్పటికే ఆ 5 లక్షల కోట్ల స్థాయిని దాటేసిందని భావిస్తున్నారు. ఈ జిడిపి వృద్ధి వ్యామోహంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి ఈ దేశ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న తరగతి-అంటే, గ్రామీణ శ్రామికుల జీవన ప్రమాణాలు వాస్తవంగా దిగజారిపోతున్నాయి అన్న వాస్తవం కనిపించడంలేదు. అంతే కాదు, అధ్యయన బృందం మరొక విషయాన్ని కూడా నిర్ధారించింది. 2014 నాటికే అమలులో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, గర్భిణీ స్త్రీల సంరక్షణ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, అంగన్వాడీ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి 5 సంక్షేమ పథకాలను ఎన్డీయే ప్రభుత్వం దెబ్బ తీసింది. 2011 తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగలేదు. బిజెపి ప్రభుత్వం దానిని నిలిపివేసింది. దానివలన కొత్తగా జనాభాలో ఈ కాలంలో చేరిన కోట్లాదిమంది నిరుపేదలు ప్రభుత్వ లెక్కల్లో లేరు. వారందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకం కింద చెల్లించే వేతనాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఏ విధమైన పెరుగుదలా లేదు. పైగా చేసిన పనులకు చెల్లించవలసిన వేతనాల బకాయిలే నెలల తరబడి పేరుకు పోయాయి. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు చెల్లించే పింఛ ను ఎప్పటినుంచో ఆ రూ.200 దగ్గరే నిలిచిపోయింది. గర్భిణీ స్త్రీలకు వర్తించే సంక్షేమ పథకం ఒక బిడ్డ వరకు మాత్రమే పరిమితం చేశారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో 40 శాతం కోత పెట్టారు. మొత్తంగా చూసుకుంటే మోడీ పాలనాకాలంలో గ్రామీణ శ్రామికుల నిజవేతనాలు తగ్గిపోవడమే కాక, వారికి వర్తించే సంక్షేమ పథకాలలో కూడా కోతలు పడ్డాయి. కరోనా కాలంలో ప్రతీ కుటుంబానికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టిన మాట నిజం. అది నేటికీ కొనసాగుతోంది. ఐతే దాని వలన కలిగే ఫలితం చాలా స్వల్పం. వేతనాల తరుగుదల, సంక్షేమంలో కోత ప్రభావం చాలా ఎక్కువ. నిజానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, గ్రామీణ శ్రామికుల నిజవేతనాల్లో ప్రతీ ఏడూ ఎంతో కొంత పెరుగుదల ఉంటూ వచ్చింది. 2014-15 నుంచీ మాత్రం అది తిరుగు ముఖం పట్టింది. కొంతకాలం ఏ పెరుగుదలా లేకుండా స్తబ్దంగా ఉండి, చివర్లో ఏకంగా తగ్గడం ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం పలు అవకతవక ఆర్థిక విధానాలను అనుసరించింది. పెద్ద నోట్ల రద్దు అటువంటి చర్యల్లో ఒకటి. దాని వినాశకర ప్రభావం గ్రామీణ పేదలమీద ఆ తర్వాత కాలంలో స్పష్టంగా కనిపించింది. అదే మాదిరిగా జిఎస్టి ని ప్రవేశపెట్టడం కూడా మరో చర్య. దానివలన చిన్న ఉత్పత్తి వ్యవస్థలమీద చాలా ప్రతికూల ప్రభావం పడింది. దాని ఫలితంగా నిరుద్యోగం కూడా పెరిగింది. దాని వలన నిజవేతనాలలో పెరుగుదల లేకుండా పోయింది. కోవిడ్-19 కాలంలో విధించిన దారుణమైన లాక్డౌన్ మరొక వినాశకర చర్య. దీని ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా దెబ్బ తింది. నిరుద్యోగం పెరిగింది. నిజవేతనాలు ఎక్కువ మోతాదులో పడిపోయాయి. ఐతే, అంతకు ముందు నుండే (అంటే, 2014 నుండీ) గ్రామీణ శ్రామికుల వేతనాలలో పెరుగుదల లేకుండా పోవడానికి కారణం ఏమిటి? నయా ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణం. 2008లో అమెరికాలో బద్దలైన రియల్ ఎస్టేట్ బుడగ ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించింది. ఐతే, అప్పటికి అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని పెంచే దిశగా కొన్ని చర్యలు తీసుకుంది. దానివలన ఆ సంక్షోభ ప్రభావం మన దేశం మీద తక్కువగా పడింది. ఐతే, 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. నయా ఉదారవాదం కోరుకున్నట్టు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. దాని ఫలితంగా దేశ స్థూల డిమాండు స్థాయి దెబ్బ తింది. దాని పర్యవసానంగా దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బ ప్రభావం గ్రామీణ భారతం మీదనే అత్యధికంగా పడింది. గ్రామీణుల నిజ వేతనాలు పడిపోయాయి. నిజ వేతనాలు తగ్గిపోవడం, ఉపాధి అవకాశాలు పడిపోవడం అనే ఈ రెండు ధోరణులూ ఒకదానిని ఇంకొకటి ప్రకోపింపజేస్తాయి. నిరుద్యోగం తక్కువగా ఉంటే, వేతనాలు పడిపోవు. ఎంతో కొంత పెరుగు తాయి. నిజవేతనాలు పడిపోతున్నాయి అంటే అదే కాలంలో నిరుద్యోగం కూడా పెరుగుతోందన్న మాటే. అంటే ఏక కాలంలో గ్రామీణ పేదలు అటు నిజవేతనాల్లో తగ్గుదలను, ఇటు నిరుద్యోగం పెరుగుదలను చవిచూడవలసి వస్తోందన్నమాట. రోజు కూలీ రేటు నిజ విలువ తగ్గడమే గాక. పనులు దొరికే రోజుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నమాట. అంటే వారి వేతనాల నిజ విలువ మాత్రమే గాక, వారికి లభించే నిజ ఆదాయాలు కూడా పడిపోతున్నాయి. దీనికి తోడు సంక్షేమ పథకాలలో కూడా కోత పడుతోంది. ఇదంతా కలిపి చూస్తే గ్రామీణ పేదలు అనుభవించే పరిస్థితులు ఎంత దుర్భరంగా మారుతున్నాయో పూర్తి చిత్రం కనిపిస్తుంది. బిజెపి పాలన వర్గ స్వభావం ఎంత ప్రజా వ్యతిరేకమో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగిపోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలంలోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

# నిబద్ధతకు ప్రతిరూపం పుచ్చలపల్లి

ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, సమసమాజం కోసం పోరాడిన విప్లవకారుడు. కులవ్యవస్థను నిరసించి పేరులో కులాన్ని సూచించే పదాన్ని తొలగించుకున్న ఆదర్శవాది. ఉద్యమాల కోసం
తన వాటా కింద వచ్చిన యావదాస్తిని ప్రజా పోరాటాల కోసం ఖర్చు చేసిన మార్గదర్శి. ప్రజలకు, పార్టీకి పూర్తి కాలం ప్రజలకు, పార్టీకి సేవలు అందించాలనే ఉద్దేశంతో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న గొప్ప త్యాగశీలి. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు. ఇలా పేర్కొంటూ వెళితే, పేజీలు చాలవు. ఆయనే కామ్రేడ్ "పి.ఎస్". గా పిలువబడిన, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పక్కా కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున జన్మించి, కమ్యునిజాన్ని ఔపోసన పట్టి, కన్ను మూసే వరకు ఆ భావజాలంలోనే కొనసాగిన పోరాట యోధుడు. పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో 1913, మే 1 న జన్మించారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లిదండ్రులు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించగా, ప్రాథమిక విద్యను వీధిబడిలోనే, తరువాత తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివారు.

గాంధీజీ నాయకత్వం పట్ల ఆకర్షితులై, సుందరయ్య 1930లో తన 17వ యేట ఉన్నత పాఠశాల రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలలోను, ఉప్పు సత్యాగ్రహం లోను, సహాయ నిరాకరణోద్యమం లోను పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. అతనిని నిజామాబాద్, బోర్స్టల్ స్కూలులో ఉంచారు. ఆ సమయంలో ఆయనకు కమ్యూనిస్టులతో పరిచయం ఏర్పడింది. విడుదల అయినాక తన స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడానికి కృషి చేశాడు. అమీర్ హైదర్ ఖాన్ స్ఫూర్తితో సుందరయ్య భారతీయ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికి ఆ పార్టీ నిషేధంలో ఉంది. 1930 దశకంలో దినకర్ మెహతా, సజ్జద్ జహీర్, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, సోలీ బాట్లివాలా వంటి జాతీయ కార్య నిర్వాహక వర్గ సభ్యులైన ప్రముఖ కమ్యూనిస్టు నేతలతో చేరి సుందరయ్య క్రమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి అయ్యారు. అమీర్ హైదర్ ఖాన్ అరెస్టు తరువాత దక్షిణాదిలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను పార్టీ కేంద్ర కమిటీ సుందరయ్యకు అప్పగించింది. ఈ సమయంలోనే కేరళకు చెందిన నంబూద్రిపాద్, కృష్ణ పిళ్ళై వంటి నాయకులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుండి కమ్యూనిస్టు పార్టీలోకి మారారు. సుందరయ్య ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు శాఖను ప్రారంభించారు. ఇతర రాష్ట్రాలలో కమ్యూనిస్టు శాఖల ప్రారంభానికి కూడా స్ఫూర్తినిచ్చారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ప్రారంభించిన వారిలో




సుందరయ్య ఒకరు. ఆ సభకు సంయుక్త కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటీష ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించి నపుడు, 1939 నుండి 1942 వరకు, నాలుగేళ్ళు అజ్ఞాతంలో గడిపారు.

1943లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేశారు. బొంబాయిలో మొదటి పార్టీ కాంగ్రెస్ జరిగింది. తరువాత రెండవ పార్టీ కాంగ్రెస్ కలకత్తాలో జరిగింది. రెండుసార్లు కేంద్ర కమిటీ సభ్యునిగా సుందరయ్య ఎన్నికయ్యారు. కలకత్తా సమావేశంలో పార్టీ సాయుధ పోరాటంను సమర్థిస్తూ తీర్మానం చేసింది. దీనిని "కలకత్తా థీసిస్" అంటారు. అప్పటి సాధారణ కారదర్శి బి.టి.రణదివే ఈ తీర్మానాన్ని బలంగా సమర్థించారు. తత్ఫలితంగా కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయుధాలను సమకూర్చుకోవడం ప్రారంభించారు. త్రిపుర, తెలంగాణ, తిరువాన్కురు ప్రాంతాలలో సాయుధ పోరాటాలు జరిగాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనది. నిజాం పాలన కాలంలో సాగిన తెలంగాణా సాయుధ పోరాట ఘట్టం. ఆ పోరాటానికి ముఖ్యమైన నాయకులలో సుందరయ్య ఒకరు. పోరాట చివరి దశలో 1948 నుండి 1952 వరకు సుందరయ్య అజ్ఞాతంలో గడిపారు. 1952 లో ప్రత్యేక పార్టీ సమావేశంలో మళ్ళీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్టీ అత్యున్నత స్థాయి సంఘమైన "పొలిట్ బ్యూరో" సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెసులోను, పాలక్కాడ్‌లో జరిగిన నాలుగవ పార్టీ కాంగ్రెసులోను కూడా కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. తరువాత అమృత్‌సర్‌లో జరిగిన ఐదవ పార్టీ కాంగ్రెస్‌లో సెంట్రల్ ఎక్జిక్యూటివ్ కమిటీకి సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సమయంలోనే పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. 1962 లో చైనాతో భారతదేశం యుద్ధం సందర్భంగా, పార్టీ నాయకత్వంలో ఎస్.ఎ. డాంగే వర్గం భారత ప్రభుత్వాన్ని సమర్థించింది. అంతే కాకుండా చైనా, రష్యా విభేదాలు తలెత్తిన నేపథ్యంలో డాంగే వర్గం రష్యాకు అనుకూలమైన పంథాను సమర్థించింది. అయితే పి.సి.జోషి, రణదివే వంటి నాయకుల వర్గం ఈ విధానాన్ని రివిజనిస్టు మార్గంగా భావించింది. డాంగే వర్గాన్ని లెఫ్టిస్టులనీ, రణదివె వర్గాన్ని రైటిస్టులనీ పిలిచారు. లెఫ్టిస్టు వర్గంలో ఉన్న ప్రముఖ నాయకుడైన సుందరయ్య అమృత్‌సర్ సమావేశం సమయంలో పార్టీ నాయకత్వంలో అధికుల (డాంగే వర్గం) ధృక్పథాన్ని వ్యతిరేకిస్తూ, తన బాధ్యతలన్నింటికీ రాజీనామా చేశారు. 1962 నవంబరులో, చైనా యుద్ధం సమయంలో సుందరయ్యను అరెస్టు చేశారు. "తెలంగాణా ప్రజల పోరాటం - దాని పాఠాలు" అన్న నివేదికలో సుందరయ్య అప్పటి పరిస్థితులనూ, పార్టీ విధానాలనూ, పోరాట క్రమాన్నీ విశదంగా విశ్లేషించాడు. సుందరయ్య తయారు చేసిన ఈ నివేదికను భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 1972 డిసెంబరు నెలలో విడుదల చేసింది.

అక్టోబరు - నవంబరు 1964 లో జరిగిన 7వ పార్టీ కాంగ్రెస్‌లో భారతీయ కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. అందులో లెఫ్టిస్టులన బడేవారు భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పేరుతో క్రొత్త పార్టీగా ఏర్పడ్డారు. ఆ పార్టీకి సుందరయ్య సాధారణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది కాలంలోనే భారత జాతీయ కాంగ్రెసు ప్రభుత్వం అనేక మంది సి.పి.ఐ-ఎమ్ నాయకులను అరెస్టు చేసిన సమయంలో సుందరయ్య మే 1966 వరకు నిర్బంధంలో ఉన్నారు. 1975 - 1977 కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించి నపుడు అరెస్టును తప్పించు కోవడం కోసం సుందరయ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. 1976 వరకు సుందరయ్య సి.పి.ఐ-ఎమ్ పార్టీ సాధారణ కార్యదర్శిగా కొనసాగారు. 1976లో ఎమర్జెన్సీ కొనసాగుతున్న సమయంలో పార్టీలో 'రివిజనిస్టు' భావాలను వ్యతిరేకిస్తూ సుందరయ్య సాధారణ కార్యదర్శి పదవికి, పొలిట్ బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1952లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యారు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభా సభ్యునిగా కొనసాగారు. కొంత కాలం విరామానతరం 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు కొనసాగారు. లీలా అనే సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగిని 1943 ఫిబ్రవరి 27న పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషీ, మరికొద్ది మంది పార్టీ నేతల సమక్షంలో వివాహం చేసుకుని, 1944 చివర్లో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కోవడం ఆయన కుల పక్షపాత రాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడై, కుల వ్యవస్థను నిరసించిన పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి...కులాన్ని సూచించే రెడ్డి తోక పదాన్ని పూర్తిగా తొలగించుకున్న ఆదర్శ మూర్తి. పార్లమెంటు భవనానికి రాష్ట్ర విధానసభకు వెళ్ళినపుడు సైకిలును ఉపయోగించడాన్నిబట్టి ఆయన నిరాడంబరత తేటతెల్లం అవుతుంది. పేదరికం, దోపిడీ నుంచి పేదల విముక్తికి జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య 1985, మే 19న పుచ్చలపల్లి కన్నుమూశారు.

## శ్రామికుల ఆరోగ్యం, భద్రత యాజమాన్యాల బాధ్యతే!

ఐక్యరాసమితికి చెందిన 'ప్రపంచ కార్మిక సంస్థ' సౌజన్యంతో ప్రతి ఏటా 28 ఏప్రిల్ రోజున 'ప్రపంచ విధి నిర్వహణలో భద్రత మరియు ఆరోగ్య దినం'తో పాటు 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' జరుపు కోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ రోజున కార్య క్షేత్ర సమస్యలు, అనారోగ్య కారకాలు, ఎదురయ్యే ప్రమాదాలు, నివారణ మార్గాలు, ప్రాణ రక్షణ శిక్షణలు, ఆత్మ రక్షణ చర్యలు, గాయాలకు సత్వర చికిత్సలు, విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామికుల స్మారకార్థ కార్యక్రమాలు లాంటి పలు అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపడతారు. 2003 నుంచి ఇలాంటి అత్యవసర కార్యక్రమాలను 'ప్రపంచ కార్మిక సంస్థ (వరల్డ్ లేబర్ ఆర్గనైజేషన్, ఐయల్ఓ)' ప్రతి ఏటా చేపడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు 6,300 మంది శ్రామికులు విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో లేదా తీవ్ర వ్యాధులతో మరణిస్తుండగా, ఏడాదికి 2.3 మిలియన్ల ప్రాణాలొదులుతున్నారు. ఏడాదికి దాదాపు 317 మిలియన్ల ప్రమాదాలు నమోదు అవుతున్నాయి. క్షేత్ర సంబంధ ప్రమాదాలు, వ్యాధులను తగ్గించే సదుద్దేశంతో పలు దేశాలు అవసర చర్యలు చేపట్టాలని 2017లో ప్రపంచ కార్మిక సంస్థ విజ్ఞప్తి చేసింది. 2030 నాటికి ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-17 సఫలం కావడానికి పేదరిక నిర్మూలన, భూగ్రహాన్ని కాపాడుకోవడం, ఆర్థిక ప్రగతి సాధనలకు చర్యలు చేపట్టాలి. 28 ఏప్రిల్ రోజున 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' కూడా జరుపుకోవడం పరిపాటిగా వస్తున్నది. 01 మే రోజున "కార్మిక దినం" జరుపుకోవడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్న సందర్భమిది. కోవిడ్ మహమ్మారి ప్రభంజనానికి ప్రభుత్వాలు, ఉద్యోగులు, శ్రామికులు, సాధారణ ప్రజానీకం అనేక సవాళ్ళను ఎదుర్కోవడంతో పాటు కార్యక్షేత్రంలో అసాధారణ అనారోగ్య పరిస్థితులను అనుభవించారు. వైరస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉద్యోగ శ్రామిక వర్గాల ఆరోగ్య పరిరక్షణ, భద్రతలకు సంబంధించిన పలు సమగ్ర చర్యలు తీసుకోవలసిన కనీస బాధ్యత యాజమాన్యాల మీద ఉంది. కార్య క్షేత్రంలో పని చేస్తున్న సిబ్బంది సంపూర్ణ ఆరోగ్య, భద్రతలకు సంబంధించిన చర్యలు తీసుకోవడానికి 'నేషనల్ అక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ సిస్టమ్'ను ఏర్పాటు చేసి కార్మిక, శ్రామిక, భద్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు మార్గనిర్దేశకాలు విడుదల చేస్తూ, పటిష్టంగా అమలు అయ్యేలా చూడాల్సిన కర్తవ్యం ప్రభుత్వ, యాజమాన్యాల మీద ఉన్నది. ఉద్యోగ శ్రామిక వర్గాలు అంకితభావంతో పని చేస్తేనే దేశ ఆర్థిక ప్రగతి రథం సక్రమంగా సాగుతుంది. విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పారిశ్రామిక ప్రగతి కొనసాగేలా చూశారు. కరోనా అకాలంలో ఆరోగ్య పరిరక్షణ యజ్ఞంలో ప్రాణాలొడ్డి అమూల్య సేవలు అందిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్లను కాపాడుకోవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాలతో పాటు మనందరి మీద ఉందని గుర్తించాం. మన అపార మానవ సంపదనుల విపత్తుల నుంచి కాపాడుకుంటూ, ఆర్థిక పురోగమనాన్ని కొనసాగించాలి. ముఖ్యంగా ఉద్యోగ, శ్రామిక, కార్షక, కార్మిక వర్గాల మానసిక స్థైర్యాన్ని కాపాడాల్సి ఉంది. ప్రమాదాలను పసిగడుతూ, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొనే శిక్షణలు తీసుకుంటూ, ఆరోగ్య భద్రతలను కాపాడే వ్యవస్థలను ప్రతి సంస్థ/కార్యాలయం/పరిశ్రమ/వ్యాపార/వర్తక వర్గాలు వెంటనే నెలకొల్పాలి. క్షేత్ర స్థాయిలో జరిగే ప్రమాదాలను నివారించడం, వృత్తి సంబంధ వ్యాధులను అరికట్టడం, గాయపడిన వారికి సత్వర చికిత్సలు అందించడం, భవిష్యత్తు భద్రతా చర్యలను చేపట్టడం గూర్చిన అవగాహన చేపట్టాలి. 28 ఏప్రిల్ రోజున విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామిక సోదరులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించే వేదికగా 'ప్రపంచ కార్యక్షేత్రంలో భద్రత, ఆరోగ్య దినం-2024' ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించాలి. ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవం వల్ల ఉత్పన్నమైన నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ లాంటి ప్రక్రియలు క్షేత్రస్థాయిలో పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సిబ్బందిలో పెరిగిన పని భారం, ఉద్యోగాల్లో కోతతో పని ఒత్తిడి, పని క్షేత్రంలో శుచి శుభ్రత కొరవడడం లాంటి కారణాలతో ఆరోగ్యం గాల్లో దీపం అవుతున్నది.

## శ్రామిక విజయానికి చిహ్నాం

మే దినోత్సవం కార్మిక ఐక్యతకు సంకేతం. చైతన్యానికి ప్రతిరూపం. చాకిరీకి వ్యతిరేకంగా నినదించిన నేపథ్యం. వేలాది గొంతుకలు ఒక్కటైన సమయం. కార్మిక వర్గ పోరాట పటిమకు నిలువెత్తు నిదర్శనం. ఎనిమిది పని గంటల దినం కోసం పోరాట సందర్భం. ప్రాణ త్యాగాలకు వెరవని వైనం. యాజమాన్యం దిగి వచ్చిన క్రమం. నెరవేరిన కార్మిక లక్ష్యం. కార్మికులు సాధించిన విజయానికి నిలువెత్తు సాక్ష్యం. కొందరు కార్మికుల రక్త తర్పణం తో కార్మిక ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చిన నేపథ్యం. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పరిమిత పని దినాలను కోరుతూ లక్షలాది మంది కార్మికులు సమ్మె చేశారు. ప్రదర్శనను చెదర గొట్టేందుకు పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మార్కెట్ ప్రాంతమంతా రక్తసిక్తమై కార్మికుల హాహాకారాలతో దద్దరిల్లింది. ఒక పోలీసు సార్జెంట్‌ను హత్య చేశారనే నిరాధార అభియోగంతో కార్మిక నాయకులైన పార్సన్, స్పైన్, ఏంగెల్,ఫిషెలను దారుణంగా ఉరి తీశారు. ఉరికంబ మెక్కిన "స్పైన్" నేను ఉరి తీయబడినంత మాత్రాన ఈ అగ్ని జ్వాల అంతరించదు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అని ప్రభోదించాడు. స్పైన్ మరణ నినాదం శ్రామిక జన శంఖారావమై విశ్వవ్యాప్తంగా మార్మోగి శ్రామిక చైతన్యాన్ని రగుల్కొలిపింది. చికాగో అమరవీరుల సంస్మరణ దినంగా చరిత్రకెక్కిన మే 1 మేడే గా నిలిచి పోయింది. ఈ ఉద్యమం ప్రాదేశిక సరిహద్దులు దాటి ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తరించి చివరకు శ్రామిక విజయానికి చిహ్నాంగా రోజుకు 8 గంటల పని చట్టబద్దం చేయబడింది. అదే మేడే కు అంకురార్పణ. 1890 మే 1వ తేదీన అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఫ్.ఎల్) ఏటా మే 1 అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవంగా జరపాలని సూచించింది. నాటి నుండి నేటి వరకు ఈ మేడే విశ్వవ్యాప్తంగా ఆచరణీయమైంది. ట్రేడ్ యూనియన్లు గాని, పార్లమెంటు గానీ లేని రష్యాలో 1891 మే 1న మార్కిస్టులు రహస్యంగా తొలిసారిగా అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవం జరిపారు. ఆనాటి నుండి మే దినోత్సవ సంబరం రష్యా కార్మిక వర్గ విప్లవాత్మక సంప్రదాయంగా పరిణమించింది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మే డే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరవాతి దశకంలో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు. హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగా జరుపుకునే వారు. ఇటలీలో ముసోల్నీ, స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకోలు మే డే పైన అనేక ఆంక్షలను విధించారు. భారత దేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్లో 1862లో సమ్మెచేశారు. అప్పటి వరకు ఆ రైల్వే కార్మికులు గంటలు పనిచేసే వారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలక వర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పని చేస్తారో మేము కూడా అన్ని గంటలే పని చేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. తొలిసారిగా భారత్‌లో 1923 సంవత్సరంలో మే 1వ తేదీ మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను జరుపు కున్నారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యంతో 'మే డే'ను పాటిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమదోపిడీ, అధికంగా పనిచేయించు కోవడం కద్దు. నానాటికీ నిరుద్యోగ రక్కసి విజృంభిస్తున్న నేపథ్యంలో, ఎలాగైనా ఉద్యోగం పొందాలనే తపన, బలహీనత క్రమంలో, ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కంపెనీల ఒత్తిళ్ళ ఫలితంగా... కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు హామీలిస్తున్నాయి. ఐ.టి.రంగంలో మార్కెట్ శక్తుల ద్వారా శ్రమ దోపిడీ నానాటికీ పెట్రేగి పోతున్నది. అమెరికా కేంద్రంగా వున్న కంపెనీలు... కార్మిక చట్టాలు అమలుకు నిచుకొని మన దేశంలో కంపెనీలు పెడుతూ, పని వేళలకు మించి రాచి రంపాన పెడుతున్నారు. అలా విద్యావంతులైన యువత అధిక జీతాలకు ఆశపడి, కంపెనీల నియంతృత్వ పోకడలకు తలొగ్గి, ఆరోగ్యాలను ఫణంగా పెట్టి, జీవితాలను కొవ్వొత్తుల్లా కరిగించు కుంటున్నారు. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో అమలుకై పోరాటం అత్యంత అవసరం, అనివార్యం.

# మాదిగల ఓటు అడిగే హక్కు బీజేపీ కి లేదు

**వాస్తవ నేస్తం, బెల్లంపల్లి:** బీజెపి అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి పదేండ్లు దాటినా వర్గీకరణ చేయని భారతీయ జనతా పార్టీకి మాదిగల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ విమర్శించారు. మంగళవారం రోజు తాండూర్ మండలం లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. బిజెపి పార్టీ వర్గీకరణ విషయంలో అనేకసార్లు మాట ఇచ్చి తప్పిందని 2014 కంటె ముందు వంద రోజుల్లో వర్గీకరణ అని ఆ పార్టీ నేతలు చెప్పారని గతంలో వెంకయ్య నాయుడు కేంద్రమంత్రి హోదాలో మాదిగల మీటింగ్ లో పాల్గొని హామీ ఇచ్చారని తర్వాత కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి గా అనేకసార్లు హామీ ఇచ్చారని ఆ హామీలన్నీ మాటలకే పరిమితమయ్యాయి తప్ప చేతల రూపం దాల్చలేదని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రదాని నరేంద్ర మోడి హామీ ఇస్తే వర్గీకరణ అవుతుందని ఆశ పడ్డామని ఎన్నికల తరువాత పార్లమెంటు లో వర్గీకరణ బిల్లు పెట్టకుండా మోసం చేసారని ఇన్నిసార్లు మాదిగలను మాటలతో మభ్యపెడుతున్న బాజాపాకు మాదిగలు, మరియు మాదిగ ఉప కులాలు ఎవరూకూడా ఓటు వేయద్దని కోరుతున్నామన్నారు. గడ్డం వంశీకృష్ణ కే ఓటేసి మన హక్కులను సాద్దించు కుందామన్నారు.




మాదిగలకు మాదిగ భవనాల ఏర్పాటు జరగాలన్నా మందమర్రి లెదర్ పార్కు పునః ప్రారంభమై మాదిగ యువతకు ఉద్యోగాలు రావాలన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ని గెలిపించుకోవాల్సిన భాద్యత మనపై ఉన్నదని తెలియజేస్తున్నా మన్నారు. గడ్డం వంశీ యువనాయకుడు మంచి విజనరీ ఉన్న నాయకుడని, మాదిగలకు న్యాయం చేసే విషయంలో బెల్లంపల్లి, చెన్నూర్ శాసనసభ్యులు గడ్డం వినోద్ , వివేక్ వెంకటస్వామి కట్టుబడి ఉన్నారని ప్రతి మాదిగ ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కుశ్నపల్లి నారాయణ మాదిగ, వడ్లూరి శ్రీనివాస్ మాదిగ, జిల్లా అధ్యక్షులు కడారి రమేష్ మాదిగ, నాయకులు అట్కపురం సమ్మయ్య మాదిగ, ఆయిల్ల నర్సింహులు, ఆయిల్ల స్వామి, సుందిల్ల సంతోష్, ఇప్ప అశోక్, బొల్లి బాబన్న, సంజీవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాయమాటలతో ప్రజలను మోసం చేశాయి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్**

**వాస్తవ నేస్తం,బజర్ హత్నూర్:** తెలంగాణను బంగారు తెలంగాణ చేస్తా అని కేసీఆర్ మాయ మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేశారని, అరు గ్యారెంటీలతో కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మంగళవారం మండలంలోని చందునాయక్ తండా బూత్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, శక్తి కేంద్రం ఇంచార్జ్ రజాక్ ల ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి రానుంది అన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వమైన బీజేపీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రజలంతా బిజెపికి ఓటు వేసి, బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి నగేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి సంతోష్, పాక్స్ చైర్మన్ వెంకన్న, ఎంపీటీసీలు పండుగ మురళి,



ఈశ్వర్, పాక్స్ డైరెక్టర్ షేర్ సింగ్, సర్పంచ్ మారుతీ, బీజేపీ నాయకులు గాజుల నరేష్, నరేష్, చట్ల ఉత్తం, ఎట్టం రాములు, నానం రమణ, కొత్త శంకర్, రమేష్, ప్రసన్న రావు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులది కీలకపాత్ర

**- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సెక్టోరియల్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో సజవుగా నిర్వహించడంలో సెక్టార్ల అధికారులు కీలక వ్యక్తులు అన్నారు. తమ విధులను సమర్థవంతంగా పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెక్టార్ అధికారులు నిబద్ధతతో సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. సెక్టోరియల్ అధికారి తమ పరిధిలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పనతో పాటు ఈవీఎంలు పాట్లు హ్యాండ్ బుక్ పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్లు పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం మాకు పోలింగ్ నిర్వహణ పై పూర్తి అవగాహన హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి తెలుసుకొని ఉండాలని సూచించారు. ఎన్నికలు విధులు నిర్వర్తించేందుకు వచ్చే సిబ్బందికి ఎన్నికల రోజున తగు సూచనలు అందించాలని తెలిపారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ సిబ్బంది తరలింపు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో సమన్వయం




చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే శిక్షకులచే నివృత్తి చేసుకోవాలని ఎన్నికలు ప్రశాంతంగా సదువుగా జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల పట్ల ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని తప్పులు జరిగితే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు పోలింగ్ పూర్తి అయ్యేవరకు తీసుకోవలసిన అన్ని జాగ్రత్తల పట్ల మాకు పోల్ ఈవీఎంలు వివి ప్యాట్లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రేట్కనర్లు వివరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు సెక్టోరియల్ అధికారులకు వివి పాట్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజా రాణి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీలో కొనసాగుతున్న చేరికలు

**కరీంనగర్ :** భారతీయ జనతా పార్టీలో చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల అసెంబ్లీ నుండి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేసిన పత్తిపాక సురేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వీరందరికీ బండి సంజయ్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో సిరిసిల్ల నియోజకవర్గానికి చెందిన పిస్క వెంకటేశ్, బుదారం సదానంద్, బీమని నగేశ్, కొంపల్లి మురళి, గుడ్ల సురేష్ కుమార్, శ్రీధర్, దాసరి వెంకటేశ్, ఆడెపు లక్ష్మణ్, సత్యవికాస్, బలుసాని అనిల్, తుపాకుల రమేశ్, శివపురం శ్రీనివాస్, బోగ కనకయ్య, శ్రీరాం విష్ణు, బూర పవన్, పల్లె ప్రశాంత్ తదితరులు బీజేపీలో చేరారు. అట్లాగే కరీంనగర్ లోని లక్ష్మి నగర్ 31వ డివిజన్ కు చెందిన మాజీ కాంగ్రెస్ నేత వి.కిశోర్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఈరోజు బండి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. వీరిలో వి.నర్సింహరాజు, బి.నవీన్, కె.నాగరాజు, జి.సాయికిరణ్, జి.మణిదీప్, జి.సాయి క్రిష్ణ, జి.సాయి కుమార్, జి.శివ, పి.అంజి, పి.శ్రీనివాస్, ఎండీ.హస్సన్ అన్సార్, టి.నిరంజన్, ఏ.అరుణ్, మీనార్ ఖాన్, వి.రాకేశ్ తదితరులు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు? ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు? నారాయణసహా పలువురు నాయకులు సైతం ఎంపీ కార్యాలయానికి వచ్చి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

## ఉమ్మడి అదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలో పదవతరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత

**- ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** మంగళవారం పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఉమ్మడి అదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలో 50 ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా ప్రకటనలో తెలిపారు. ఇదే విధంగా వచ్చే విద్యా సంవత్సరంలో ఉమ్మడి అదిలాబాద్ ఆశ్రమ పాఠశాలలు అన్నీ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా, నాణ్యమైన విద్యను అందించేలా, ప్రతీ ఆశ్రమ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలుపుతూ విద్యార్థులను అభినందించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల సంవత్సరాల వారిగా.. ఆదిలాబాద్ జిల్లాలో 2022-2023 గత ఏడాది 80%, 2023-2024 ఈ ఏడాది 91%, నిర్మల్ జిల్లాలో :2022-2023 గత ఏడాది 96%, 2023-2024 ఈ ఏడాది 100%, ఆసిఫాబాద్ జిల్లాలో 2022-2023 గత ఏడాది 70%, 2023-2024 ఈ ఏడాది 92%, మంచిర్యాల జిల్లాలో 2022-2023 గత ఏడాది 59%, 2023-2024 ఈ ఏడాది 92%, విద్యార్థులు ఉత్తెనులయ్యారని తెలిపారు.

## రైతుల ధర్నాలతో కదిలిన యంత్రాంగం



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో నిలువ ఉంచిన మా ధాన్యాన్ని మాకు ఇవ్వాలని సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందు రైతులు ధర్నా చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం కదిలి వచ్చింది. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడి గంగుబాయి మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ని సందర్శించి రైతులతో మాట్లాడి వివరాల అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద సరియైన పత్రాలు ఉంటే ఎవరి ధాన్యం వారికి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్ రావు,మార్కెట్ కమిటీ సిబ్బంది జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎ ఎం సి చైర్మన్ హమీద్, రవి పటేల్,హన్మంతరావు పటేల్,శ్రీధర్,రైతులు తదితరులు ఉన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు





**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళ వారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి 2023-24 పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు జీపిఏలో 10/10 సాధించి టాపర్స్ గా నిలిచారు. 10/10 జీపీఏ సాధించిన వారిలో బోడకుంట దీపిక, గొర్ల స్ఫూర్తి, 10/10 జీపీఏ ను సాధించారు. అదేవిధంగా జీపిఏలో 9.0 నుండి 9.7 జీపిఏ 29 మంది విద్యార్థులు సాదించారు. పదవ తరగతి ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థులు 98.46 % ఉత్తీర్ణత సాదించారు. ఉత్తిర్ణతకు సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరియు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజా రమేష్ అభినందించారు.

## ఆవుకు అంత్యక్రియలు



**వాస్తవనేస్తం,బజార్హత్నూర్:** మనిషి ప్రేమకు ఎల్లలుండవు. అది అయినవారి మీదైనా, పశువుల మీదైనా. ఎంతగా ప్రేమిస్తారో, దూరమైతే అంతగా విలవిల్లాడిపోతారు. రైతైతే తనను పోషిస్తున్న పశువులపై మరింత ప్రేమను పెంచుకుంటాడు. తాను కంటికి రెప్పలా చూసుకుంటున్న గోవు మృతి చెందటంతో ఓ రైతు కుటుంబం విలవిల్లాడిపోయింది. మండలంలోని భూతాయి బుజ్రుగ్ లో ముండే బాలాజీ ఆవు అనారోగ్యంతో మృతి చెందినది. కాగా గోమాత కు అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంఘము అధ్యక్షుడు ఫడ్ జ్ఞానేశ్వర్ బాలాజీ రాజేందర్ దినేష్ తదితరులు పాలోన్నారు.

## పదవ తరగతి పరీక్షలో సత్తా చాటిన మునిపల్లి మోడల్ స్కూల్





**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** పది ఫలితాలలో మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో మొత్తం 412 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఒక్కరు తప్ప 411 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఏంఈఓ అన్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించగలమని విద్యార్థులు రుజువు చేశారని వారు ఇలాగే కష్టపడి చదివి ఉన్నత చదువులు చదవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభకు కృషిచేసిన వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఓవైసీ నగర్‌లో కార్డెన్ అండ్ సెర్చ్

**భైంసా :** నిర్మల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు భైంసా టౌన్ సిఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఓవైసీ నగర్ లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో సరైన పత్రాలు లేని 112 ద్విచక్ర వాహనాలు, 13 ఆటోలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని కంపల్సరిగా నడిపే వ్యక్తికి లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలని టౌన్ సీఐ రాజారెడ్డి సూచించారు. ఈ కర్డెన్ సెర్చ్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.

# చెవి నొప్పికి ఇంట్లోనే పరిష్కారం..



చెవి నొప్పి, పన్ను నొప్పి వస్తే భరించడం కష్టమే. ఇక చెవి నొప్పి అయితే మరింత బాధ పెడుతుంది. కొన్ని సార్లు ఈ నొప్పి ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంది.కానీ కొన్ని సార్లు మాత్రం రింగింగ్ అనే శబ్దం చేస్తూ ఇబ్బంది పెడుతుంటుంది. ఇలా మీకు వినిపిస్తే మీ చెవి ఇన్ఫెక్షన్ కు గురి అయినట్టే. అంతేకాదు మీ చెవిలో బ్యాక్టీరియా చేరినట్టే అని అర్థం చేసుకోండి. దీని వల్లనే ఇన్ఫెక్షన్ వస్తుంది. ఈ చెవి ఇన్ఫెక్షన్ ను ముందుగానే తెలుసుకొని ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుందట. ఇంతకీ అవేంటి అంటే..చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి. వీటి ద్వారా బ్యాక్టీరియా, వైరస్ లు ఎక్కువగా వ్యాపిస్తాయి. ముక్కు, నోటిని తాకాలి అనుకుంటే ముందుగా చేతులను కచ్చితంగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోరు ముక్కు ను కూడా టిష్యూ తో అడ్డం పెట్టుకోవాలి. సమయానికి టిష్యూ దగ్గర లేకపోతే చేతులు అడ్డం పెట్టి చేతులు శుభ్రంగా కడుక్కోండి. ధూమపానం వల్ల చెవి నొప్పి వస్తుందట. దీని వల్ల యూస్టేషియన్ ట్యూబ్ లను చికాకు పెడతాయి. దీని వల్ల చెవి ఇన్ఫెక్షన్ కు గురి అవుతుంది. పిల్లలకు న్యుమోకాకల్ టీకాలను వేయించాలి. దీని వల్ల చెవి నొప్పి రాదట. ఉన్నా కూడా తగ్గుతుంది. అంతేకాదు ఇన్ఫెక్షన్ తగ్గిస్తుంది ఈ టీకా. చిన్న పిల్లలకు బ్రెస్ట్ ఫీడింగ్ ఇవ్వడం వల్ల కూడా చెవి సమస్యలు తొలిగిపోతాయట. ఇందులో వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది. దీని వల్ల చెవి ఇన్ఫెక్షన్ దూరం అవడమే కాదు ఇతర అనారోగ్య సమస్యలు కూడా దరి చేరవు. చెవులను ఎప్పుడు కూడా వెచ్చగా ఉంచుకోవాలి అంటారు నిపుణులు. చెవులను వెచ్చగా ఉంచడం వల్ల ఇన్ఫెక్షన్ లు రావు. వైరస్, బ్యాక్టీరియాలు చల్లని వాతావరణంలో బాగా వృద్ధి చెందుతాయి. అందుకే వెచ్చదనం బెటర్. ఇక ఇయర్ డ్రాప్స్ ఇన్ఫెక్షన్లను దూరం చేస్తాయి. ఐబుప్రోఫెన్ లేదా ఎసిటమినోఫెన్ వంటి మందుల వల్ల పరిష్కారం ఉంటుంది కాబట్టి ఉపయోగించండి. కానీ ఒకసారి వైద్యులను సంప్రదించడం మంచిది అని గుర్తు పెట్టుకోండి.

# ఎండతో ఈ క్యాన్సర్.. తప్పక తెలుసుకోవాల్సిన విషయమిదీ




ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఎండలకు భయపడుతున్నారు. ఉదయం 8 నుంచి ఎండలు మొదలు అవుతున్నాయి. 9 తర్వాత ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే వామ్మో అనాల్సిందే. అంతేకాదు ఇప్పుడు సన్ బర్న్ సమస్య కూడా పెరిగిపోయింది. దీన్ని తేలిగ్గా తీసుకోవద్దు అంటున్నారు నిపుణులు. సన్ బర్న్ వల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా ఉందట. ఎవరైనా ఎక్కువ సేపు ఎండలో ఉంటే సూర్యుని కిరణాల రేడియేషన్ వల్ల చర్మ కణజాలం లోని డీఎన్ ఏ కు హాని కలుగుతుంది అంటున్నారు నిపుణులు. దీని వల్ల మ్యుటేషన్ అవుతుందట. ఆ తర్వాత క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందట. అందుకే ఎండలో పనిచేసే వారు జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎక్కువ సేపు ఉంటే మెలనోమా అనే క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందట. ఇది చాలా ప్రమాదకరమైనది అంటున్నారు నిపుణులు. దీనికి సర్జరీ మాత్రమే చికిత్స. ఆ తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ వంటివి మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బేసల్ సెల్ కార్సినోమా క్యాన్సర్.. సూర్య కిరణాల వల్ల వచ్చే చర్మ క్యాన్సర్ లలో ఈ క్యాన్సర్ కూడా ప్రధానమైనది. ముఖం, ముక్కు, పెదవి, చేతులు, భుజాలు వంటి ప్రదేశాల్లో ఈ క్యాన్సర్ వస్తుంది. దీనికి చికిత్స అందుబాటులో ఉంది. ఇక సర్జరీ, రేడియో థెరపీ ద్వారా చికిత్స చేస్తారు.స్క్వామస్ సెల్ కార్సినోమా క్యాన్సర్.. ఎండలో ఎక్కువ సేపు ఉండేవారికి ఈ రకమైన క్యాన్సర్ వస్తుంది. ఎండకు గురయ్యే భాగాల్లో ఈ క్యాన్సర్ ముప్పు వస్తుందట. అంటే చెవులు, మెడ, చేతులు, ముఖం వంటి భాగాలకు ఈ క్యాన్సర్ వస్తుంది. దీనికి కూడా సర్జరీ ద్వారా చికిత్స చేస్తారు. ఈ రకరకాలైన క్యాన్సర్ లు కేవలం ఎండవల్ల మాత్రమే వస్తాయి కాబట్టి ఎండకు వెళ్లకుండా ఉండటం ఉత్తమం కదా. సో ఎండకు కాస్త దూరంగా ఉండండి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# పిల్లలకు ఎలాంటి ఆహారం ఇస్తున్నారు?



ప్రస్తుతం మలబద్ధకం సమస్య చాలా మందిని వేధిస్తోంది. ఈ సమస్య చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కూడా సామాన్యంగా వస్తుంటుంది. అయితే ఆహార పదార్థాలు, ఆహార అలవాట్లే దీనికి కారణం అంటారు నిపుణులు.తిన్న ఆహారం సరిగా జీర్ణం అవదు. దీని వల్ల కూడా మలబద్ధకం సమస్య వస్తుందట. అయితే చిన్న పిల్లలకు కూడా ఈ సమస్య వస్తుంది. మరి మీ పిల్లలను ఈ సమస్య వేధించవద్దు అంటే ఏం చేయాలో ఓ సారి చూసేద్దాం. చాలా మంది పిల్లలకు ఎప్పుడు కూడా పప్పు అన్నం పెడుతుంటారు. ప్రతి రోజు ప్రతి పూట కూడా పప్పు అన్నమే తినిపిస్తుంటారు. కొందరు పప్పు అన్నంతో పాటు పెరుగు అన్నం ఆడ్ చేస్తారు. చాలా మంది పిల్లలను మీరు అడిగితే కూడా ఇదే మాట చెబుతారు. పప్పు అన్నమో లేదా పెరుగు అన్నమో తిన్నామని సమాధానం ఇస్తుంటారు. మరి కేవలం ఈ పప్పు, పెరుగుల వల్ల పిల్లల పెరుగుదలకు కావాల్సిన విటమిన్లు, ప్రోటీన్లు, మినరల్స్ అందుతాయా అనే విషయాలను ఆలోచించరు. పప్పు పిల్లలకు బలం. కానీ పప్పు, పెరుగు జీర్ణం అవడానికి ఎలాంటి పదార్థాలను వారికి అందిస్తున్నాము అనేది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. అయితే పిల్లలకు పీచు పదార్థాలను అలవాటు చేయాలి. ప్రతి రోజు వారికి ఇచ్చే భోజనం తో పాటు ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. నమిలి తినడం వల్ల చాలా లాభాలు ఉంటాయి. కొందరు పిల్లలు వీటిని ఇష్టపడరు. పప్పులో ఆకుకూరలు వేయాలి. ఇక పిల్లలకు తోటకూర చాలా మంచిది. అందుకే పప్పులో ఆకుకూరలు వేయండి. తోటకూర వారి డైట్ లో భాగం చేయండి. పాలకూరను కూడా ఎక్కువగా పెడుతుంటారు. ఈ పాలకూర కంటే కూడా తోటకూర వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయట. మరి మీ పిల్లలు ఆరోగ్యం మీ చేతుల్లో ఉంది కాబట్టి జర జాగ్రత్త. ఇప్పటి నుంచే పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం వల్ల వయసు పెరుగుతున్న కొద్ది వారికి ఎలాంటి సమస్యలు రావు అని గుర్తు పెట్టుకోండి.

# తిన్న వెంటనే నీరు తాగుతున్నారా?



రోజు కొన్ని అలవాట్లు ఉంటాయి. వాటి వల్ల ఆరోగ్యానికి కొన్ని సార్లు మేలు చేస్తే మరికొన్ని సార్లు చెడు జరుగుతుంది. మీరు చేసే చిన్న చిన్న తప్పులే మీ ఆరోగ్యాన్ని ఇబ్బంది పెడుతాయి. శాశ్వతంగా మీకు ఇబ్బంది కూడా జరుగుతుంది. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే అలవాటు మీలో చాలా మందికి ఉండవచ్చు. అదేంటి అనుకుంటున్నారా? అన్నం తిన్న తర్వాత మీరు నీరు తాగుతారా? ఇది ఎవరైనా చేస్తారు కదా అనుకుంటున్నారా? అయితే ఒకసారి ఇది చదివేసేయండి.ఏది తిన్నా కొందరు వెంటనే నీరు తాగుతుంటారు. స్వీట్లు తిన్నా, టీ, కాఫీలు తాగినా సరే వెంటనే నీరు తాగుతుంటారు. తినే కంటే ముందు, తిన్న తర్వాత నీరు తాగడం చాలా మందికి అలవాటు. అంతేకాదు కొందరు అన్నం తిన్న తర్వాత వెంటనే నీరు తాగుతుంటారు. కొందరు అన్నం తింటూ కూడా మధ్య మధ్యలో నీరును తాగుతుంటారు. కానీ ఇలా చేయడం చాలా ప్రమాదకరమైన అలవాటు అంటారు నిపుణులు. అన్నం తిన్న తర్వాత వెంటనే నీటిని సేవించవద్దట. ఇలా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయట. అన్నం తిన్న తర్వాత వెంటనే నీరును తాగకుండా 20 నుంచి 30 నిమిషాల తర్వాత నీటిని తాగాలట. అన్నం తిన్న తర్వాత తట్టుకున్నట్లు లేదా కచ్చితంగా తాగాలి అనిపిస్తే ఒక స్విప్ తాగి వదిలేయండి. కానీ కొందరు ఇక లైఫ్ లో వాటర్ దొరకవేమో అన్నట్టుగా ఒక రెండు గ్లాసులు తాగుతుంటారు. కానీ ఇలా చేయకుండా కాస్త వాటర్ మాత్రమే తీసుకోండి అంటూ సలహా ఇస్తున్నారు నిపుణులు. ఇక తిన్న వెంటనే నడస్తుంటారు కొందరు. నడకను కూడా పరుగులా చేస్తుంటారు. ఇలా కూడా చేయవద్దట. తిన్న తర్వాత నడవకుండా వజ్రాసనంలో కూర్చోవడం వల్ల చాలా లాభాలు ఉంటాయట. అయితే తిన్న ఆహారం జీర్ణం అవడం చాలా ముఖ్యం. కానీ తెలిసి తెలియక చేసే తప్పుల వల్ల ఆహారం జీర్ణం అవదు. అందులోని ఒక మిస్టేక్ తిన్న వెంటనే నీటిని తాగడం అంటారు నిపుణులు. మరి తెలుసుకున్నారు కదా ఇప్పటి నుంచి తిన్న తర్వాత వెంటనే ఎక్కువ నీటిని తీసుకోకండి. అర్జెంట్ అనిపిస్తే ఒక స్విప్ వేయండి.

# మధుమేహులు మామిడికాయలు తినాలంటే




వేసవి మొదలైంది అంటే చాలు ఎండ,వేడిమి చూసి ప్రజలు ఎంతగా భయపడతారో,అంతే ఆత్రుతగా మామిడిపళ్ళు వస్తాయని కూడా ఎదురు చూస్తూ ఉంటారు.మామిడిపళ్ళను చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ చాలా ఇష్టంగా తింటారు.మామిడి కాయను పండ్లకే రారాజు అని ఊరికే అంటారా.కానీ డయాబెటిస్తో బాధపడేవారు మాత్రం మామిడికాయ తినాలా..వద్దా..అని మాత్రం తటపటాయిస్తూ ఉంటారు. వారు మామిడి పండ్లు తినాలంటే కొన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తే చాలని,సంవత్సరానికి ఒకసారి వేసవికాలంలో దొరికే మామిడి పళ్ళను చక్కగా ఎంజాయ్ చేయొచ్చు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.మరి ఆ జాగ్రత్తలు ఏంటో మనము తెలుసుకుందాం పదండి.. మధుమేహంతో బాధపడేవారు పండ్లల్లో గ్లైసమిక్ ఇండెక్స్ లెవెల్స్ ని బట్టి తీసుకోవాల్సి వస్తుంది.ఏ పండులో అయితే గ్లైసమిక్ ఇండెక్స్ 55 కన్నా తక్కువగా ఉంటుందో,ఆ పండ్లను నిర్మొహమాటంగా,నిర్భయంగా తీసుకోవచ్చు.ఇలాంటి కోవలోకి వస్తుంది మామిడిపండు.సాధారణంగా మామిడి పండుకు గ్లైసమిక్ ఇండెక్స్ 50 నుంచి 53 వరకు ఉంటుంది.ఈ పండ్లను వారు తక్కువ మోతాదులో తీసుకోవడం చాలా ఉత్తమం. మరియు ఈ పండును తీసుకునే సమయంలో కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉన్న ఆహారాలను మాత్రమే తీసుకోవాలి.ఎందుకంటే కార్బోహైడ్రేట్స్ తో కలిపి మామిడి పండును తీసుకోవడంతో,వారిలో షుగర్ లెవెల్స్ పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మరియు మామిడి పండు తినాలి అనుకుంటే,పగటి సమయంలో తినడమే ఉత్తమం.ఎందుకంటే ఇందులో ఉన్న కార్బోహైడ్రేట్స్ రిలీజ్ చేసే శక్తి పగటిపూట ఈజీగా ఖర్చవుతుంది కనుక. మామిడిపళ్ళను సహజ పద్ధతిలో పండించిన వాటిని ఎంచుకోవడం ఉత్తమం.ఎందుకంటే ఇందులో వాడిన కెమికల్స్ ప్రతి ఒక్కరికి హాని కలిగిస్తాయి.మరీ ముఖ్యంగా మదుమేహులు వీటి నుంచి దూరంగా ఉండటం చాలా మంచిది. మామిడి పండ్లను రెండు ముక్కల కంటే ఎక్కువగా తీసుకోకూడదు.మరియు జ్యూస్ రూపంలోను,చక్కర వేసిన ముక్కలు అసలే తీసుకోకూడదు.ఎందుకంటే ఇందులో ఉన్న షుగర్స్ రక్తంలోకి నేరుగా కలిసిపోయి మధుమేహాన్ని పెంచుతాయి. ఈ జాగ్రత్తలు పాటిస్తూ మధుమేహం వేసవి సీజన్లో దొరికే మామిడి కాయలను ఈజీగా ఎంజాయ్ చేయవచ్చు.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



# స్థానిక వార్తలు

## మెట్రో రూట్ మ్యాప్ రెడీ



**హైదరాబాద్ :** రాజధాని వాసులకు మెట్రో అధికారులు గుడ్ న్యూస్. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న మెట్రో ఫేజ్-2కి సంబంధించిన పనులు ఇక పరుగులెత్తనున్నాయి. ఫేజ్-2లో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం మార్గంలో నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 14 కి.మీ మెట్రో మార్గాన్ని, నిర్మించనున్నామని, ఈ మార్గంలో మొత్తం 13 మెట్రో స్టేషన్లు రానున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నాగోల్ మెట్రో స్టేషన్‌తో ప్రారంభమై.. నాగోల్ చౌరస్తా, అల్కాపురి చౌరస్తా, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ కూడలి, సాగర్ రింగ్‌రోడ్డు, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్ కూడలి, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, హాఫీజ్ బాబానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో కొత్త మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు. కొత్తగా రానున్న మెట్రో రైలు స్టేషన్లకు సంబంధించి వాటి పేర్ల ఖరారుకు ట్రాఫిక్ పోలీసులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు స్వీకరించాలని అధికారులు నిర్ణయించారు. నాగోల్‌లో ఇప్పుడున్న స్టేషన్ సమీపంలోనే న్యూ నాగోల్ ఎయిర్‌పోర్ట్ స్టేషన్ ఎడమవైపు(ఎల్బీనగర్ మార్గంలో) రానుంది. ఈ రెండింటినీ కలిపేలా విశాలమైన స్కైవాక్ నిర్మించనున్నారు. నాగోల్‌లో మూసీ వంతెన వద్ద మంచినీటి పైపులైన్లు, హెచ్‌టీ విద్యుత్తు లైన్లు ఉన్నందున మెట్రో ఎలైన్‌మెంట్‌ను 10మీటర్లు ఎడమ వైపు మార్చాలని నిర్ణయించారు. బైరామల్‌గూడ/సాగర్ రోడ్ జంక్షన్‌లో ఫ్లైఓవర్ల కారణంగా మెట్రో లైన్ ఎలైన్‌మెంట్‌ను కుడివైపు మార్చాల్సిరావచ్చని అధికారులు నిర్ణయించారు.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీమ్, హైదరాబాద్మెట్రోపై ప్రభావం చూపుతోంది.

# రూ.37 లక్షల విలువ గల గంజాయి కాల్చివేత





**19 కేసుల్లోని 150 కేజీల గంజాయి దహనం**

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలోని 11 పోలీస్ స్టేషన్లో నమోదైన 19 కేసుల్లో వివిధ సందర్భాల్లో నిందితుల వద్ద నుండి సీజ్ చేసిన 150 కిలోల నిషేధిత గంజాయి మంగళవారం. తలమడుగు మండలం సుంకిడి గ్రామ శివారులను నిర్మాణ అటవీ ప్రాంతం నందు పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దాహనం చేశారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారుగా 37 లక్షల రూపాయలు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ గా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్, సభ్యులుగా ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వర్టికల్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, డిఎస్పి సురేందర్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో కోర్టు అనుమతి తీసుకుని ఈ నిషేధిత గంజాయిని మంగళవారం సాయంత్రం దహనం చేశారు. జిల్లా ఎస్పీ ఈ గంజాయిని కేసులవారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్డిపిఎస్ యాక్ట్ లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేయడం జరిగిందాని తెలియజేశారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తూ డబ్బు సంపాదించాలనే దురాశ, గ్రామీణ ప్రాంత రైతులను ప్రలోభాలకు గురి చేస్తూ గంజాయి రవాణా చేయడం జరుగుతుంది. వాటందర్నీ అరికట్టే విధంగా పటిష్టమైన ప్రణాళికను రూపొందించి అవలంబించడం జరుగుతుందని తెలియజేశారు. గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాలను విక్రయించే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు యువతపై ప్రత్యేక శ్రద్ధను వహిస్తూ పిల్లల దిన చర్యను పరిశీలిస్తూ ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్ సురేందర్ రావు, డీఎస్పీలు జీవన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్‌ను వదలని సైబర్ కేటుగాళ్లు




**హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తమకు పనికొచ్చే ఏ ఒక్క మార్గాన్ని వదలట్లేదు. టెక్నాలజీని ఉపయోగించి జనాలను నిలువు దోపడీ చేసేస్తున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం అనే తేడా లేకుండా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేస్తూ అమాయకుల జీవితాలు నెట్టింట అమ్మకానికి పెట్టేస్తున్నారు. అయితే.. ఈ ఇబ్బందులు సామాన్యులకే కాదు సెలబ్రెటీలు, రాజకీయ నేతలుతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు కూడా తప్పడం లేదు. గతంలో కొంతమంది సైబర్ నేరగాళ్లు ఐఏఎస్, ఐపీఎస్‌ల ఫోటోలు, పేర్లు వాడుకొని.. బెదిరించి డబ్బు దోచుకున్న ఘటనలు జరిగాయి. తాజాగా అలాంటి ఘటనే.. తెలంగాణ సీఎస్ శాంతికుమారికి ఎదురైంది.తెలంగాణ సీఎస్ శాంతికుమారి తన పేరు, ఫొటోతో.. పలువురికి ఫేక్ కాల్స్ చేస్తున్నారు సైబర్ మోసగాళ్లు. ఈ విషయాన్ని తెలుసుకున్న శాంతికుమారి.. వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. +977-984-4013103 ఫోన్ నెంబర్‌తో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు.. ఇటీవల కొందరికి కాల్స్ చేస్తున్నారని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు శాంతి కుమారి ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేక్ కాల్స్ చేస్తున్నవారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీఎస్ శాంతికుమారి కోరారు. కేసు నమోదు చేసుకున్న టీఎస్‌సీఎస్‌బీ ఫేక్ కాల్స్ చేసినవారిని కనిపెట్టే పనిలో పడ్డారు.గతంలో కూడా అంజనీ కుమార్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారుల ఫొటోలు, పేర్లతో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. ఫేక్ కాల్స్ చేసి.. కొందరిని బెదిరింపులకు పాల్పడ్డ ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. కాగా.. ఇప్పుడు ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఒక సీఎస్‌ను కూడా కేటుగాళ్లు వదలకపోవటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని.. ఉన్నతాధికారుల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇలాంటి ఫేక్ కాల్స్ కానీ, సైబర్ నేరగా?ళ్ల కదలికలు కానీ గుర్తించినప్పుడు అప్రమత్తంగా ఉండి.. ఎలాంటి వివరాలు ఇవ్వకుండా.. వెంటనే తమను సంప్రదించాలని... పోలీసులు సూచిస్తున్నారు.

# పెద్దపల్లిలో బిగ్‌ఫైట్.. బాస్ ఎవరో?

**పెద్దపెల్లి గడ్డపై 'పెద్దన్న'గా నిలిచేదేవరో ..**

**సింగరేణి అండ.. ఎవరికో పూదండ**

**బొగ్గు గని కార్మికులే గెలుపు ఓటముల నిర్ణేతలు**

**పెద్దపెల్లి పార్లమెంటు నియోజకవర్గ ముఖచిత్రం**







**కమాన్ పూర్ :** పెద్దపల్లి జిల్లా పోరాటాల గడ్డ పెద్దపల్లి ఎంపీగా గెలిచి పార్లమెంటు లో అడుగుపెట్టేది ఎవరో త్రిముక పోటీలో పెద్దపల్లి నాయకుడు ఎవరు కారున్నారో చూడాల్సిందే.

విప్లవ వీరులను అందించిన పెద్దపల్లి లోకసభ స్థానానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది వామపక్ష ఉద్యమానికి ఊపిరిలోదిన సోదరులు కిషన్ జి వర మల్లోజుల కోటేశ్వరరావు మల్లోజుల వేణుగోపాలరావు పెద్దపెల్లి బిడ్డలే వీరే కాకుండా అనేకమంది అగ్ర నేతలుగా ఎదిగారు. సింగరేణి బొగ్గు గనులు, పచ్చని పొలాలు, తెలంగాణ సాగు దశను మార్చే కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, ఎన్టీపీసీ, సిమెంట్ పరిశ్రమలు, యూరియా కర్మాగారం.. ధర్మపురి, కాళేశ్వరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నెలవు పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం. నైసర్గికంగానే కాకుండా రాజకీయంగానూ విభిన్నత, వైవిధ్యం దీని సొంతం. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఈ నియోజకవర్గం ఇచ్చే తీర్పుపై ఆసక్తి నెలకొంది. పెద్దపల్లి లోకసభ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నియోజకవర్గం కాక ఫ్యామిలీకి కంచుకోట కాగా, గత రెండు పర్యాయాలు కారు జోరు చూపించింది. ఈసారి కారు జోరుకు బ్రేకులు వేసేందుకు హస్తం పార్టీ కాక మనుమడు, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. బీఆర్ఎస్ కూడా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దింపగా, బిజెపి పార్టీ కూడా గోమాస శ్రీనివాస్ ను రంగంలోకి దించింది. దీంతో ఈ నియోజకవర్గంలో పోరు ఆసక్తికరంగా మారింది. ఈసారి ఎలాగైనా పూర్వ వైభవాన్ని సాధించాలని హస్తం పార్టీ కసితో పనిచేస్తుండగా.. అధికార పార్టీకి దీటుగా బీఆర్ఎస్ మరోవైపు బిజెపి వ్యూహ ప్రతి వ్యూహాలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పెద్దపల్లి లోకసభ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. సింగరేణి కార్మికుల ప్రభావం అధికంగా ఉండే ఈ సెగ్మెంట్లో గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీదే హవా కొనసాగుతోంది. గత పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ పెద్దపల్లి నియోజకవర్గాన్ని భారీ విక్టరీతో తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. మరోవైపు బిజెపి కూడా ప్రధాని మోదీ చెరిస్మాతో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. మొత్తానికి మూడు పార్టీలు కూడా తగ్గేదిలే అన్నట్లుగా ఎత్తుకు పైఎత్తులతో రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నాయి. పెద్దపెల్లి, మంచిర్యాల, జగిత్యాల నియోజకవర్గం పరిధిలో విస్తరించిన ఈ లోకసభ నియోజకవర్గం పరిధిలో పెద్దపెల్లి, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన 2023 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడు శాసనసభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో 6 లక్షల 82 వేల 33 ఓట్లు సాధించి తిరుగులేని ఆదిపత్యాన్ని చెలాయించింది కాంగ్రెస్ పార్టీ. కాగా ప్రధాన ప్రతిపక్షం బి ఆర్ ఎస్ పార్టీకి 3 లక్షల 36 వేల 374 వేల ఓట్లు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ పార్టీ హవా కొనసాగిన పెద్దపల్లి లో గత శాసనసభ ఎన్నికల్లో పూర్తి రివర్స్ ఫలితాలు వచ్చాయి. ఈసారి ఎలాగైనా గెలవాలని కలలుగంటున్న బిజెపికి గత శాసనసభ ఎన్నికల్లో ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 79 వేల 418 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయాలను సాధించగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి పరిస్థితిలో మార్పు వచ్చిందనే ఆశతో ప్రతిపక్ష పార్టీలు పోటీకి రెడీ అవుతున్నాయి. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరగా, సీనియర్ నేత మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి రంగంలోకి దించింది. ఇక ఎప్పటినుండో ఎంపీ కావాలని కలలు కంటున్న గోమాస శ్రీనివాస్ ను బరిలోకి దింపింది బిజెపి. ఇక ఈ రెండు పార్టీలకు దీటుగా ఆర్థిక బలం.. రాజకీయ నేపథ్యం ఉన్న కాక మనవడు, చెన్నూరు శాసనసభ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను ఈ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ బరిలోకి దించింది. పెద్దపెల్లి నియోజకవర్గ పరిధిలో సింగరేణి, ఆర్ ఎఫ్ సి ఎల్, ఎన్ టి పి సి, సిమెంటు పరిశ్రమలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులే గెలుపు ఓటమి లను ప్రభావితం చేస్తారు. ప్రస్తుతం ఈ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో ఆ పార్టీలో గెలుపు ధీమా ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ దూకుడుకు కళ్లెం వేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్క స్కెచ్ వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే టార్గెట్ తో సీనియర్ నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు టికెట్ ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కొప్పుల ఈశ్వర్ అనూహ్యంగా గత ఎన్నికల్లో ధర్మపురి శాసనసభ నియోజకవర్గ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతిలో ఓడిపోయారు. సింగరేణి కార్మికుడైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో బందు వర్గం, మిత్రులు, అనుచర వర్గం భారీగా ఉంది. గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన మేడారం నియోజకవర్గ పరిధిలో భాగమైన రామగుండం, ధర్మపురి నియోజకవర్గంలో అభిమానులు ఉన్నారు. దీంతో కోల్ బెల్టు వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి ఓటు బ్యాంకు బలంగా ఉండటంతో గెలుపు పై ఆశలు పెట్టుకుంటుంది. తనకున్న విస్తృత పరిచయాలు తనను గెలిపిస్తాయని నమ్మకంతో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధీమాగా ఉన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలంతో హస్తం జెండా ఎగరేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ బలంగా నమ్ముతున్నారు. బలమైన ఆర్థిక నేపథ్యం.. ఘనమైన రాజకీయ వారసత్వం ఉన్న గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఖరారు చేసి అసెంబ్లీ ఎన్నికల ఊపును కొనసాగిస్తామని కాంగ్రెస్ అంటుంది. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడైన వంశీకృష్ణ తన తాత దివంగత నేత గడ్డం వెంకటస్వామి రాజకీయ వారసత్వానికి తోడుగా.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారు. తన తాత, తండ్రి ఇద్దరూ ఈ నియోజకవర్గ ఎంపీలుగా ఉండటం తోనే అప్పట్లో వాళ్ళు తెచ్చిన పథకాలు, నిధుల తోనే స్పష్టమైన ముద్ర వేశారని గడ్డం వంశి చెబుతున్నారు. ఈ పెద్దపెల్లి లోకసభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండటం తో పాటు, ఇటీవల జరిగిన సింగరేణి ఎన్నికలలో కాంగ్రెస్ అనుబంధ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలవడం కాంగ్రెస్ కు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇదే సమయంలో బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ చీల్చే ఓట్లు కూడా ఈ నియోజకవర్గంలో కీలకంగా మారాయి. 1993 నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన గోమాత శ్రీనివాస్ 2009లో కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డారు. అప్పట్లో టిఆర్ఎస్ పార్టీలో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 2 లక్షల64 వేల 731 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో ఓటమి తర్వాత బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన గోమాస మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు శాసనసభ నియోజకవర్గ స్థానాన్ని ఆశించారు. టికెట్టు దక్కకపోవడంతో సంతృప్తితో కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపి పార్టీలో చేరారు. పార్లమెంట్ పరిధిలో 15 లక్షల 94, వేల 392 ఓట్లు ఉండగా, అందులో గోమాత శ్రీనివాస్ సామాజిక వర్గమైన మహావీర్ నేతకాని ఓట్లు 2 లక్షల 25 వేల 875 ఓట్లు ఉన్నాయి. ఈ ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తుందని గోమాస ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ సామాజిక వర్గ ఓట్లతో పాటుగా, ఇతర వర్గాలకు చెందిన ఓట్లను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో పడ్డారు. ప్రస్తుతం పోటీ పడుతున్న అభ్యర్థులు నేతకాని మాల సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఇందులో మాదిగ సామాజిక వర్గం ఎవరు వైపు మొగ్గు చూపుతోందనేది ఆసక్తికరంగా మారింది. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో.. రామగుండం, బెల్లంపల్లి, చెన్నూరు, మంథని నియోజకవర్గాల్లో అత్యధికంగా సింగరేణి కార్మిక కుటుంబాలున్నాయి. అభ్యర్థుల గెలుపోటములను వీరి ఓట్లే నిర్దేశిస్తాయి. సింగరేణి కార్మిక కుటుంబాలు ఏళ్లుగా ఎదురు చూస్తున్న అంశం వారసత్వ ఉద్యోగాలు. గత అసెంబ్లీ 2018 ఎన్నికల్లోనూ దీనిపై ప్రచారం చేసి టిఆర్ఎస్ ఓటర్లను ఆకర్షించింది. కానీ వారసత్వ ఉద్యోగాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్య పెండింగ్‌లో ఉంది. దీంతో ఈ ఎన్నికల్లో ఇదే అంశాన్ని కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా ఎంచుకుంది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అవకాశం ఇచ్చిన ఓటర్లు ఈసారి ఎలాంటి తీర్పునిస్తారో చూడాలి. పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచిన పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలో ఏడు శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిలో ధర్మపురి, చెన్నూరు, మందమర్రి శాసనసభ స్థానాలు ఎస్సీ రిజర్వుడు కాగా, రామగుండం, మంథని, పెద్దపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ లతో పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గంలో ప్రస్తుతం 17వ సారి పార్లమెంటరీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓట్లు 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. వీరిలో పురుషులు 7 లక్షల 87 వేల 140 ఓట్లు కాగా, మహిళల ఓట్లు 8 లక్షల 5 వేల 755 ఉన్నాయి. పురుషుల కన్నా 18 వేల 615 మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపెల్లి లోక్సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అన్నింటిని గెలుచుకొని క్లీన్ స్వీప్ చేసింది. 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుండి బోర్లకుంట వెంకటేష్ నేత 4 లక్షల 41వేల 321 ఓట్లు సాధించి గెలుపొందగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆగం చంద్రశేఖర్ 3లక్షల 46వేల 141 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. బిజెపి అభ్యర్థి ఎస్. కుమార్ 92,066 ఓట్లు సాధించి తృతీయ స్థానాన్ని సరిపెట్టుకున్నారు.

## వరలక్ష్మి శరత్‌కుమార్ శబరి నుంచి అలసిన ఊపిరి సాంగ్



కోలీవుడ్ బ్యూటీ వరలక్ష్మి శరత్‌కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న నటిస్తోన్న చిత్రం శబరి అనిల్ కట్జ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోంది. ఇప్పటికే మేకర్స్ శబరి ప్రపంచాన్ని పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన వీడియోలో వరలక్ష్మి శరత్‌కుమార్ బైక్‌పై స్టైలిష్ గా రైడ్ చేస్తున్న విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం నుంచి అలసిన ఊపిరి సాంగ్‌ను లాంఛ్ చేశాడు డైరెక్టర్ కరుణకుమార్. వరలక్ష్మి సోలో ట్రాక్ సినిమాకు హైలెట్‌గా నిలవనుందని విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ సందర్భంగా కరుణకుమార్ మాట్లాడుతూ.. పాట లిరిక్స్, విజువల్ ప్రెజెంటేషన్ నాకు బాగా నచ్చాయి. సినిమాలో చూపించిన తల్లీ కూతుళ్ల సెంటిమెంట్ యూనివర్సల్ స్థాయిలో ఉంది. సినిమా కోసం టీమ్ తమ మనస్సు పెట్టి పనిచేసింది.

# మనసుకు గాయమైతే అలా చేయకండి



నమ్మినవాళ్లే మోసం చేస్తే ఏడుస్తూ ఉండకూడదని.. మనసుకు తగిలిన గాయాన్ని మనమే నయం చేసుకోవాలని అన్నారు డైరెక్టర్ పూరి జగన్నాథ్. కొన్నాళ్లుగా యూట్యూబ్ వేదికగా పూరి మ్యూజింగ్స్ పేరుతో అనేక అంశాలపై తనదైన ఆలోచనలను, అభిప్రాయాలను అభిమానులతో పంచుకుంటున్న సంగతి తెలిసిందే.పూరి మ్యూజింగ్స్ యూట్యూబ్ ఛానల్లో ఎప్పుడో ఏదోక అంశంపై మాట్లాడుతుంటారు పూరి. తాజాగా ప్రేమలో విఫలమైతే కోలుకోవడం.. నమ్మినవాళ్లే మోసం చేస్తే వీలైనంత త్వరగా కోలుకోవాలంటూ చెప్పుకొచ్చారు. “కొన్నిసార్లు శరీరానికి అనేక దెబ్బలు తగులుతాయి. ఏం జరిగినా వెంటనే మన బాడీ వాటిని తగ్గించేందుకు ప్రయత్నిస్తుంది. కొన్ని దెబ్బలు తగ్గడానికి చాలా రోజులు పడుతుంది. మరికొన్ని నయం కావడానికి వారాలు పట్టొచ్చు. కొన్ని చచ్చిపోతే కొత్తవి పుట్టుకోస్తాయి. అలాగే కొన్నిసార్లు మన గుండెకు దెబ్బలు తగులుతాయి. కన్నతండ్రి చనిపోవచ్చు. కష్టపడిదంతా గంగలో కలిసిపోవచ్చు. నమ్మినవాళ్లు మోసం చేయొచ్చు. వీటిని మనమే నయం చేసుకోవాలి. ఆ శక్తి మన చేతుల్లోనే ఉంది. ఏం జరిగినా.. ఎంత అనర్థం జరిగినా త్వరగా మాములు మనిషిగా మారాలి. మానసికంగా ధృఢంగా ఉండాలి. రోజులతరబడి ఏడుస్తూ ఉండకూడదు. ఎంత ఏడ్చినా ఉపయోగం లేనప్పుడు జరిగిన నష్టం భర్తీ కానప్పుడు ఎందుకు ఏడవాలి. ? వీలైనంత త్వరగా అందులోనుంచి బయటకు వచ్చేయ.. మనల్ని ఎవరూ ఓదార్చకూడదు.. ఎవరో సానుభూతి కోసం ఎప్పుడూ ఎదురుచూడొద్దు. మనకు మనమే ధైర్యం చెప్పుకొవాలి. కష్టం వచ్చినప్పుడు బాగా ఏడవండి.. కానీ ఆ వెంటనే పనిలో బిజీగా మారండి. ప్రేమలో విఫలమైన కొందరు మద్యానికి బానిసలవుతారు. దయచేసి అలా చేయకండి. ఎంత నష్టం వచ్చినా ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచించాలి. ఎంతో కష్టం వచ్చినా ఒత్తిడిగా భావించొద్దు.

# ఐటెం పాటకు నో చెప్పిన శ్రీలీల



కోలీవుడ్ టాప్ స్టార్స్‌లో ఒకరైన విజయ్ సినిమాలో అవకాశం అంటే ఏ హీరోయిన్ మాత్రం నో అంటుం ది. కానీ టాలీవుడ్ యువ హీరోయిన్ శ్రీలీల మాత్రం నో చెప్పేసింది. అందుకు కారణం లేకపోలేదు. వివరాల్లోకి వెళితే.. విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘గోట్’. విజయ్ పొలిటికల్ ఎంట్రీ ఇస్తుండడంతో తన కెరీర్‌లో ఇదే చివరి చిత్రం అనే ప్రచారం జరుగుతోంది.దీంతో అంచనాలు ఓ స్థాయిలో ఉన్నాయి. ఇందులో స్పెషల్ సాంగ్ కోసం శ్రీలీలను సంప్రదించారట. అయితే ఈ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించిందట. అజిత్ సినిమా ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’తో ఆమె కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతోంది. అదే టైమ్‌లో ఈ ఆఫర్ వచ్చింది. ఐటం సాంగ్‌తో ఎంట్రీ ఇవ్వడం కంటే హీరోయిన్‌గా కోలీవుడ్‌కు పరిచయం అవడం ఆమె కెరీర్ కు ప్లస్ అవుతుంది. అదీకాక గతంలో పలు ఇంటర్వ్యూస్ లో స్పెషల్ సాంగ్స్ చేయనని చెప్పిందామె. మరి అలాంటి పాటలు చేసే ఆసక్తి లేకనో, లేదా కెరీర్‌లో బెటర్‌మెంట్ కోసమో అనేది శ్రీలీలకే తెలియాలి. అయితే ధమాకా, గుంటూరు కారం లాంటి చిత్రాల్లో ఆమె డ్యాన్సులు చూసి స్పెషల్ సాంగ్‌లో ఆమెను ఊహించుకున్న తమిళ అభిమానులకు మాత్రం ప్రస్తుతానికి నిరాశ తప్పలేదు!

## పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌అల్లరి నరేష్ నటించిన అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ‘ఆ ఒక్కటీ అడక్కు’. మల్లి అంకం దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మించారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్. మే 3న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో దర్శకుడు మల్లి మీడియాతో ముచ్చటించారు. ”ఆ ఒక్కటీ అడక్కు’ ఈ కథకు యాప్ట్ టైటిల్. ఈ టైటిల్ పెట్టాలనే ఆలోచన కూడా నరేష్‌దే. కేవలం టైటిల్ వరకే తీసుకున్నాం. ఈ కథకు, ఆ సినిమాకు సంబంధం లేదు. పెళ్లి చుట్టూ ఎలాంటి ఎమోషన్స్ వుంటాయి?, కొందరు ఆ ఎమోషన్స్‌ని ఎలా క్యాష్ చేసుకుంటారు? ఇలాంటి అంశాలని చాలా వినోదాత్మకంగా చూపిస్తూనే ఎమోషనల్ కనెక్ట్ అయ్యేలా ప్రెజెంట్ చేశాం. ఇందులో ఉండే కంటెంట్‌కి అందరూ కనెక్ట్ అయ్యేలా వుంటుంది. ఇది అందరినీ అలరించే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. హీరోని పెళ్లి గురించి అందరూ అడుగుతున్నప్పుడు ఆయన సమాధానంగా చెప్పే మాట ‘ఆ ఒక్కటీ అడక్కు’. నిజానికి పెళ్లి గురించి అందరూ చాలా తేలిగ్గా అడిగేస్తారు కానీ.. తీసుకున్నవారు దాన్ని చాలా పెయిన్ ఫీల్ అవుతారు. ఆ కుటుంబంలో కూడా అదో బాధలా ఉంటుంది. ఇందులో ఆ ఎమోషన్‌ని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేశాం. ఇందులోని కామెడీ, ఎమోషన్ ఆడియన్స్‌ని హత్తుకునేలా ఉంటాయి. ఇందులో ప్రత్యేకంగా సందేశంలా ఉండదు. కానీ.. పెళ్లి ఎప్పుడు? అని అడగడం కన్నా మీ దగ్గర ఏదైనా మంచి సంబంధం ఉంటే చూసి పెట్టండనే ఆలోచనని రేకెత్తించేలా ఈ సినిమా ఉంటుంది. అలాగే పెళ్లి సంబంధాల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో కూడా చూపించే సినిమా కూడా ఇది. నరేష్ ఫస్ట్ హాఫ్ విని ‘ఈ కథ మనం చేసేద్దాం’ అన్నారు. ఆయన క్యారెక్టరైజేషన్, పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తాయి. ఫారియా పాత్ర ఇందులో చాలా కీలకంగా వుంటుంది. కథ ఆమె పాత్ర ద్వారానే మలుపు తిరుగుతుంది. ఫరియాలో మంచి కామెడీ టైమింగ్ వుంది. ఇందులో తన పాత్రని చాలా అద్భుతంగా చేసింది’ అని చెప్పారు.






# ధర్మం కోసం యుద్ధం..

## ‘హరి హర వీరమల్లు’ నుంచి టీజర్ అప్‌డేట్

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ ప్రస్తుతం ఏపీ ఎన్నికల బిజీలో ఉన్న విషయం తెలిసిందే. మే 13న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీతో పాటు లోక్ సభ ఎన్నికలు జరుగనుండగా.. ప్రచారంలో ఫుల్ బిజీగా గడుపుతున్నాడు. అయితే పవన్ ఎన్నికల కంటే ముందు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో ఒకటి హరిహర వీరమల్లు జాగర్లమూడి క్రిష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. ఏపీ ఎన్నికల అనంతరం మళ్లీ షూటింగ్‌లో జాయిన్ కానున్నాడు పవన్. అయితే చాలా రోజుల తర్వాత ఈ సినిమా నుంచి కొత్త అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను మే 02న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. ధర్మం కోసం యుద్ధం! గురువారం 9 గంటలకు అంటూ చిత్రయూనిట్ రాసుకోచ్చింది. పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే తొలిసారి పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో నటిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com